ప్రజాశక్తి
బుధవారం 08 ఫిబ్రవరి 2023
5
కర్నూలు

జైలు పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్పీ

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

- జిల్లా జైలులో భద్రతను పరిశీలించిన ఎస్పి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

జైలులోని ఖైదీలు సత్ప్రవర్తన చెందాలని జిల్లా ఎస్పి సిద్ధార్థ్ కౌశల్ అన్నారు. మంగళవారం ఆయన కర్నూలు మండలం, పంచలింగాల గ్రామంలోని జిల్లా జైలును సందర్శించారు. భద్రత, సిసి కెమెరాల పనితీరును, కారాగారం పరిసరాలను, ఖైదీల గదులు తదితర ప్రదేశాలను పరిశీలించారు. జైలు అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లా జైలు నుండి ముద్దాయిల ఎస్కార్ట్‌పై ఆరా తీశారు. అంతర్గత భద్రతపై జైలు అధికారులకు సెక్యూరిటి రివ్యూ కమిటి అధికారులకు పలు సూచనలు చేశారు. ఖైదీలతో మాట్లాడి వారి నేర వివరాలు, స్థితి గతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జైలు జీవితాన్ని గుణపాఠంలా తీసుకుని జైలు నుండి విడుదల అయిన తర్వాత మంచి భవిష్యత్తు వైపు అడుగులు వేయాలని తెలిపారు. ఖైదీల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. భద్రత లోపాలు లేకుండా చూసుకోవాలన్నారు. భద్రత పరంగా ఎటువంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఖైదీలలో పరివర్తన కోసం తీసుకోవలసిన చర్యలను తెలిపారు. అనంతరం జైలు పరిసరాలు పరిశుభ్రంగా , ఆహ్లాదకరంగా ఉన్నాయని జిల్లా ఎస్పీ సంతృప్తి వ్యక్తం చేసి జైలు విజిటింగ్ బుక్‌లో సంతకం చేశారు. ఎఆర్ డిఎస్‌పి ఇలియాజ్ బాషా, జిల్లా జైలు సూపరింటెండెంట్ కె. గని నాయక్ (మెంబర్‌అండ్‌కన్వీనర్) , జిల్లా సబ్ జైలు అధికారి నరసింహా రెడ్డి (మెంబర్) , జిల్లా జైలు జైలర్ ఎమ్.నాగరాజు, మెడికల్ ఆఫీసర్ భాస్కర్, డిప్యూటి జైలర్లు అనిల్ కుమార్ రెడ్డి, నాగరాజు, సిఐలు మురళీధర్ రెడ్డి, రామలింగయ్య, ఆర్ ఐ రమణ, తాలుకా ఎస్ఐ బాల నరసింహా పాల్గొన్నారు.

పరిశుభ్రత వాతావరణం నెలకొల్పాలి

- కలెక్టర్ కోటేశ్వరరావు

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

ప్రభుత్వ కార్యాలయాల్లో పరిశుభ్రత వాతావరణం నెలకొల్పాలని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టరేట్ సముదాయంలో నిరుపయోగంగా ఉన్న విద్యుత్ తీగలను తీసి వేసి అవసరం ఉన్న విద్యుత్ తీగలను ఒకే పైప్ లైన్ లో అమర్చాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి వారి కార్యాలయంలో ఉన్న సెమినార్‌హాల్‌కు చేపట్టనున్న మరమ్మతు పనులను ఆర్ అండ్‌బి అధికారులు జిల్లా కలెక్టర్‌కు వివరించారు. కార్యాలయంలో అమర్చిన తలుపులను పాలిష్ చేయించడంతో పాటు కార్యాలయంలో సిబ్బందికి అవసరమైన మౌలిక సదుపాయాలలో భాగంగా మరుగుదొడ్లు నిర్మించి, వెయ్యి లీటర్ల సింటెక్స్ ట్యాంక్ ఏర్పాటు చేయించాలన్నారు. అదే విధంగా కార్యాలయంలో ఎక్జాస్ట్ ఫ్యాన్లు అమర్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.

కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్

కార్యాలయంలో నిరుపయోగంగా ఉన్న జిరాక్స్ యంత్రాలను సంబంధిత యాజమాన్యంతో సంప్రదించి ఎక్స్ఛేంజ్ రూపంలో మార్చుకునే అవకాశం ఉంటే మార్చుకోవాలన్నారు. ఓపెన్‌గా ఉన్న ప్రదేశాల్లో ఎటువంటి వ్యర్థ పదార్థాలు పారివేయకుండా మెస్ (తెర) ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా కార్యాలయాలలో సంబంధిత శాఖ ప్రగతిని ప్రతిబింబించేలా వాటికి సంబందించిన చిత్రాలను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి పిఎల్.వరలక్ష్మి, పశుసంవర్ధక శాఖ అధికారి రామచంద్రయ్య, సిపిఒ అప్పలకొండ పాల్గొన్నారు.

బాలోత్సవం లోగో ను ఆవిష్కరించిన కలెక్టర్

ఆనందం..ఉత్సాహం..ఉల్లాసం.అన్న నినాదంతో నిర్వహించబోతున్న బాలోత్సవం-2023 పిల్లల పండుగ లోగోను జిల్లాకలెక్టర్ కోటేశ్వరరావు తన కార్యాలయంలో మంగళవారం ఉదయం ఆవిష్కరించారు. ఈ చిన్నారుల పండుగ విజయవంతమవ్వాలని ఆకాంక్షించారు. లోగో ఆవిష్కరణ కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి జెఎన్ శేషయ్య, నిర్వహణ కమిటీ ప్లానింగ్ కన్వీనర్ కెంగార మోహన్, కల్చరల్ కన్వీనర్ ఎంపి బసవరాజు, కమిటీ సభ్యులు ఉమ(కెసిసి), జె.రంగస్వామి (సుందరయ్య స్ఫూర్తి కేంద్రం) తదితరులు పాల్గొన్నారు.

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి

- సిపిఐ నాయకులు

ప్రజాశక్తి- వెల్దుర్తి

నిరంతరం ప్రజా సమస్యలపై రాజులేని పోరాటాలు చేస్తూ పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న పిడిఎఫ్ అభ్యర్థి పోతుల నాగరాజు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కత్తి నరసింహారెడ్డిని గెలిపించాలని సిపిఐ మండల కార్యదర్శి కృష్ణ కోరారు. మంగళవారం వెల్దుర్తి పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో ప్రచారం నిర్వహించారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు శేషఫణి మాట్లాడుతూ పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డి నిరంతరం ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కర్షక, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, బడుగు, బలహీన వర్గాల సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తున్నారని తెలిపారు. ఇటువంటి వారిని గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పట్టభద్రుల కోటాకింద నిస్వార్థంగా పేద ప్రజల వాణి వినిపించే మేధావులను పంపాల్సిన పెద్దల సభకు కూడా అక్రమ పద్ధతులతో, డబ్బు మూటలతో పెట్టుబడిదారులను పంపడానికి పాలక ప్రతిపక్ష పార్టీలు పోటీ పడడం సిగ్గుచేటని అన్నారు. మేధావి వర్గం ఆలోచించాలని, ఎల్లప్పుడూ ప్రజా సమస్యలపై నిస్వార్థంగా పోరాడే పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించి పాలక పక్షాలకు బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో చిన్నమాదులు, మాధవస్వామి, తదితరులు పాల్గొన్నారు. **ఆలూరు** మండలంలోని మొలగవల్లి ఉన్నత పాఠశాలలో, పట్టణంలోని జూనియర్ కళాశాల, పాలిటెక్నిక్, ఐటిఐలో ఎఐటియుసి, ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికల కన్వీనర్ రంగన్న మాట్లాడారు. ఉపాధ్యాయులు, నిరుద్యోగుల సమస్యలపై పోరాడే పిడిఎఫ్ బలపరుస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థులను చట్టసభల్లోకి పంపుదామని తెలిపారు. సిపిఎస్ రద్దు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక సిపిఎస్ రద్దు చేయాలని పోరాడే ప్రభుత్వ ఉద్యోగులపై ఉక్కుపాదం మోపి, లాఠీ ఛార్జీలు, అక్రమ కేసులు బనాయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కత్తి నరసింహా రెడ్డి ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం చట్ట సభల్లో గళమెత్తారని అన్నారు. పోతుల నాగరాజు అనేక ఉద్యమాలకు సారథ్యం వహించారని తెలిపారు. ప్రశ్నించే గొంతుకలు కత్తి నరసింహారెడ్డికి, పోతుల నాగరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటును వేసి వేయించి చట్టసభలకు పంపించాలని కోరారు. ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు పి.రామాంజనేయులు, ఎఐఎస్ఎఫ్ మండల నాయకులు సాయి చరణ్, సుంకప్ప, రాజశేఖర్ పాల్గొన్నారు.

వెల్దుర్తి సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ మండల కార్యదర్శి కృష్ణ, వేదికపై పిడిఎఫ్ అభ్యర్థి పోతుల నాగరాజు

అవినీతి శాప్ ఎమ్‌డిని

సస్పెండ్ చేయాలి

- డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

అవినీతికి పాల్పడి కోట్ల రూపాయలు దండుకున్న శాప్ వైస్ చైర్మన్, ఎండి ప్రభాకర్ రెడ్డిని సస్పెండ్ చేసి అక్రమంగా సంపాదించిన సొమ్మును రికవరీ చేసి క్రీడలను అభివృద్ధి చేయాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, నగేష్ మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఎండి ప్రభాకర్ రెడ్డి అవినీతిపై నలుగురు శాప్ డైరెక్టర్లు మీడియాకు అన్ని విషయాలు వివరంగా మంగళవారం తెలిపారని గుర్తు చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలకు కేటాయించిన డబ్బులను దుర్వినియోగం చేయడం, క్రీడాకారుల కోటాలో అనర్హులకు ఉద్యోగాలు ఇప్పించడం వారి నుండి కోట్లు దండుకోవడం అర్హత లేకపోయినా గ్రూప్ వన్ ఉద్యోగాలు ఇప్పించడం వారి నుండి కోట్లు వసూలు చేశారని పేర్కొన్నారు. క్రీడాకారులకు ఒక జెర్కిన్ కూడా ఇవ్వకుండానే ఇచ్చినట్లు బిల్లులు పెట్టడం, రూ.65 లక్షలకు టెండర్ వేస్తే అందులో పది రెట్లు అధికంగా ధరలు కోట్ చేయడం, 150 హాకీ స్టిక్స్ కొని 750 కొన్నట్లు బిల్ పెట్టారన్నారు. శాప్ సిబ్బందికి సరిగా జీతాలు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేశారని, మామూళ్లు దండుకుంటున్నారని తెలిపారు. ఏదైనా బోర్డు సమావేశంలో డైరెక్టర్లు అడిగితే అబద్ధాలు చెప్పడం నిధులు లేవని చెప్పడం, క్రీడా మైదానాలు అభివృద్ధి చేయకుండా అరకొరా సోకులు చేసి భారీగా బిల్లులు పెట్టడం చేస్తారన్నారు. క్రీడా మైదానాలను, స్టేడియాలను స్విమ్మింగ్ పూల్స్, ఇండోర్ స్టేడియాలు సెటిల్ కోర్టులు యోగా కేంద్రాలను ఏకపక్షంగా టెండర్లు పిలిచి డైరెక్టర్ల ఆమోదం లేకుండానే ప్రైవేటీకరణ చేసి వారి నుండి భారీగా లంచాలు దండుకుంటున్నాడని విమర్శించారు. డైరెక్టర్లు చెప్పిన వివరాల ప్రకారమే 81 సార్లు బోర్డు సమావేశాలు జరిగితే కనీసం ఒక్కసారి కూడా క్రీడల అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికలు కానీ క్రీడాకారులకు అందించే ప్రోత్సాహకాలకు సంబంధించి కానీ, క్రీడాకారులు క్రీడలు ఆడడానికి వెళ్ళినప్పుడు చార్జీలకి డబ్బులు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టారన్నారు. కోచ్‌లపైన భారీగా ఒత్తిడి పెట్టి పే అండ్ ప్లే విధానాన్ని అమలు చేయడం పేద మధ్యతరగతి కుటుంబాల నుండి వచ్చిన క్రీడాకారులు డబ్బులు చెల్లించలేక క్రీడలకు దూరం అవుతున్న నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు.

తొలగించిన విజయ పాల డైరీ

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

- ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

విజయ పాల డైరీలో అక్రమంగా తొలగించిన తొమ్మిది మంది కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ కర్నూలు కార్మిక కర్షక భవన్‌లో వివిధ ప్రజా, కార్మిక సంఘాలతో రాయలసీమ విజయ పాల డైరీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఉద్యోగుల సంఘం (సిఐటియు)ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సంఘం కార్యదర్శి కె.నాగరాజు అధ్యక్షత వహించారు. ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు బతకన్న, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పిఎస్.రాధాకృష్ణ, ఎండి.అంజిబాబు, టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు పాలరాజు, జిల్లా కార్యదర్శి ప్రభాకర్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప, చేతి వృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ గురుశేఖర్, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ప్రభాకర్, సిఐటియు జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు మాట్లాడారు. విజయ పాల డైరీలో పనిచేస్తున్న కార్మికులను తొలగించడం అన్యాయమైన చర్య అని, వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. జిల్లాలో ఎవరికి కష్టమొచ్చినా స్పందించవలసిన కలెక్టర్ ఈ సమస్య పట్ల స్పందించకపోవడం దురదష్టకరమని అన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి కార్మికులను పనిలోకి తీసుకోవాలని కోరారు. లేబర్ అధికారులు సమస్యను ఏమాత్రం పట్టించుకోకపోగా యాజమాన్యానికి తొత్తుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. యూనియన్ పెట్టుకున్నందులకే మిమ్మల్ని తీసివేస్తామని ప్రకటించిన యాజమాన్యం తర్వాత ట్రాన్స్‌ఫర్లు చేయడం ఏమిటని వారు ప్రశ్నించారు. యూనియన్ రద్దు చేసుకొని వస్తే విధుల్లోకి తీసుకుంటామని అనడం రాజ్యాంగ విరుద్ధమని, కార్మికులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను హరించి వేయడమేనని అన్నారు. యాజమాన్యం కార్మిక అధికారుల ముందే ఇటువంటి చర్చ పెట్టడం క్షమించరాని నేరమన్నారు. కార్మిక శాఖ అధికారులు జోక్యం చేసుకొని యాజమాన్యాన్ని పిలిచి మాట్లాడి వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, లేదంటే యాజమాన్య పైన కఠినమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ సమస్య పరిష్కారానికి సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేయనున్నట్లు వారు ప్రకటించారు. ఈ సమావేశంలో కెవిపిఎస్ జిల్లా నాయకులు పెద్దబాబు, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు హుస్సేన్‌బాష, ఐఎన్‌టిసి నాయకులు ఆనందన్న, జేమ్స్ టిఎన్‌టియుసి నాయకులు హుసేని, విజయ పాల డైరీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు కలందర్, రవి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు

జెఇఇ లో గురుకుల విద్యార్థులు ప్రతిభ

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

చిన్నటేకూరులోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల అకాడమీ విద్యార్థులు జెఇఇ మెయిన్స్‌లో ప్రతిభ కనబరిచారు. ఏడాది తమ కళాశాల నుండి 55 మంది విద్యార్థులు మెయిన్స్ పరీక్షలకు హాజరు కాగా పవన్ కుమార్ 96.61 శాతం ఉత్తీర్ణతతో ఉత్తమ ప్రతిభ కనబరిచనట్లు అకాడమీ డైరెక్టర్ సుబ్బారెడ్డి తెలిపారు. 90శాతం ఉత్తీర్ణతతో దాదాపుగా 9మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరచారన్నారు. మరోసారి జాతీయస్థాయిలో తమ అకాడమీకి చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. అకాడమీకి చెందిన అధ్యాపకులను కూడా ఆయన అభినందనలు తెలిపారు. ఉత్తమ ప్రతిభ కన పరిచిన విద్యార్థుల వివరాలు ఇలా ఉన్నాయి పవన్ కుమార్ , ఆవన్ కుమార్, కిరణ్ కుమార్, ప్రవీణ్, తరుణ్, కృపారావు, శర్వాన్ ,రాజు, విద్యాసాగర్లు ఉన్నారు.

వర్సిటీ ఉద్యోగుల ధృవీకరణ పత్రాలపై పరిశీలన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని నాన్ టీచింగ్ కింద పనిచేసే ఉద్యోగుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలనకు కమిటీ వేసి పరిశీలన చేస్తున్నామని రిజిస్ట్రార్ సుందరానంద పుచ్చ తెలియజేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం సాయంత్రం ఓ ప్రకటన విడుదల చేశారు. ఏమైనా అవకతవకలు జరిగినట్టు తేలితే తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. వర్సిటీ ఉద్యోగుల నియామకాల్లో నిబంధనలు ప్రకారం జరిగినట్లు ఆయన పేర్కొన్నారు.

అన్న వడ్డిస్తున్న మేయర్ బివై.రామయ్య

శ్రీశైలం పాదయాత్ర శివ భక్తులకు అన్నదానం

ప్రజాశక్తి-కర్నూలు కార్పోరేషన్: మహా శివరాత్రి సందర్భంగా ఆంధ్ర, కర్నాటక రాష్ట్రాల నుంచి శ్రీశైలం మల్లికార్జున స్వామి దర్శనం కోసం పాదయాత్రగా వెళ్తున్న భక్తులకు వివిధ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం గార్గేయపురం రోడ్డు ఎల్లమ్మ ఆలయం సమీపంలో అక్కిమి ప్రమీలమ్మ ఫౌండేషన్, ఇగ్నైటింగ్ లైవ్స్ సొసైటి, శ్రీ లలితా కామేశ్వర సేవాసమితి, ఫ్రెండ్స్ రూరల్ , అర్బన్ డెవలప్మెంట్ సొసైటీ లు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని వైసిపి జిల్లా అధ్యక్షుడు నగర మేయర్ బివై.రామయ్య ప్రారంభించారు. బివై.రామయ్య మాట్లాడుతూ అన్నం పరబ్రహ్మ స్వరూపమని, అన్నదానం మహాదానమని, అలాంటి అన్నదాన కార్యక్రమాలను వివిధ స్వచ్ఛంద సంస్థలు భక్తుల కోసం ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. అనంతరం వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అక్కిమి హనుమంత్ రెడ్డి అన్నదాన కార్యక్రమానికి రూ.20 వేలు విరాళంను బివై రామయ్య చేతుల మీదుగా అందజేశారు.

జెఇఇ మెయిన్స్‌లో సత్తా చాటిన 'నారాయణ' విద్యార్థులు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జెఇఇ మెయిన్స్ తొలివిడత పరీక్ష ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షకు సంబందించిన ఫలితాలను జాతీయ పరీక్షల మండలి (ఎన్‌టీఏ) విడుదల చేసింది. తొలివిడత పరీక్ష ఫలితాలలో మరోసారి కర్నూలు నారాయణ విద్యార్థిని విద్యార్థులు అత్యధిక పర్సంటైల్ స్కోర్ సాధించి ప్రభంజనం సష్టించారని నారాయణ విద్యా సంస్థల కోర్ డీన్ పి.లింగేశ్వరరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా నారాయణ కళాశాలలో జరిగిన అభినందనసభలో అత్యధిక స్కోర్ సాధించి టాపర్లుగా నిలిచిన విద్యార్థిని విద్యార్థులకు అభినందనలు తెలిపారు. కర్నూలు నారాయణ కళాశాల నుండి అత్యధిక స్కోర్ సాధించిన వారిలో ఎ.అనుగ్య 99.21 పర్సంటైల్ స్కోర్, ఇ. హరిణి 99.20 పర్సంటైల్ స్కోర్ సాధించి టాపర్లుగా నిలిచారని తెలిపారు. జె. పవన్ కుమార్ రెడ్డి 98.84 పర్సంటైల్, కె. అబూబకర్ సిద్దిక్ 98.79, కె.సుధీర్ కుమార్ 98.78, ఆర్.రిషింధర్ సింగ్ 98.75 , ఎ.వెంకట సాయి శ్రీ సాహితీ 98.41, బి.మనోజ్ కుమార్ 98.36, పి.హరిణి 98.06 , ఆర్. నీహారిక 97.97, కె.విజయ తేజేశ్వని 97.93 , బి. విశ్వనాథ్ 97.86 , కె. సాయి శ్రేష్ఠ 97.65, ఎస్. లాస్య 97.38 , ఎమ్. సాయి మణిదీప్ 97.36 , జి. సాయి అనన్య 97.28 పర్సంటైల్ సాధించారన్నారు. అలాగే 99 పర్సంటైల్ పైన 2,98 పర్సంటైల్ పైన 9,97 పర్సంటైల్ పైన 16, 96 పర్సంటైల్ పైన 22, 95 పర్సంటైల్ పైన 25, 90 పర్సంటైల్ పైన 69, 80 పర్సంటైల్ పైన 221, 70 పర్సంటైల్ పైన 423 మంది విద్యార్థులు అర్హత సాధించారని వివరించారు. అనంతరం విద్యా సంస్థల కోర్ డీన్ పి. లింగేశ్వరరెడ్డి ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సన్మానించారు. విద్యార్థుల తల్లిదండ్రులను, , అధ్యాపక బృందాన్ని అభినందిచారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్లు, ప్రిన్సిపల్స్, అధ్యాపకులు , విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులు, అధ్యాపకులతో కోర్ డీన్ పి.లింగేశ్వర్‌రెడ్డి

అవాస్తవాలు ప్రచారం చేయడం తగదు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో పనిచేస్తున్న టైం స్కేల్ నాన్‌టీచింగ్ ఉద్యోగులపై అవాస్తవాలు ప్రచారం చేయడం తగదని రాయలసీమ వర్సిటీ నాన్ టీచింగ్ టైం స్కేల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నేతలు శంకరయ్య, మీనాక్షిరెడ్డి,సుంకన్న,నాగరాజు ,లక్ష్మన్న ,అయ్యన్న అనురాధ రమాదేవిలు పేర్కొన్నారు. మంగళవారం వర్సిటీలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాయలసీమ యూనివర్సిటీకి తమ పొలాలను త్యాగం చేశామన్నారు. ఇటీవల కొంతమంది తమపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. వర్సిటీ పూర్వ విద్యార్థులే ఇక్కడ పీజీ సెంటర్లో అనేకమంది నాన్ టీచింగ్ ఉద్యోగులు పనిచేసే వారున్నారు. నిబంధనలకు విరుద్ధంగా కొంతమంది పనిచేస్తున్నారని తప్పుడు ప్రచారాలు చేయడం మానుకోవాలని వారు పేర్కొన్నారు. నిబంధనల ప్రకారమే వర్సిటీ కాంట్రాక్టు ఉద్యోగులకు టైం స్కేల్ కింద వేతనాలను చెల్లిస్తుందన్నారు. ఇప్పటికైనా ఆ వాస్తవాలు ప్రచారం చేయడం విరమించుకోవాలని వాడుకోరారు.

జెఇఇ మెయిన్స్‌లో కర్నూలు శ్రీ చైతన్య విద్యాసంస్థల విజయకేతనం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

విడుదలైన జెఇఇ మెయిన్స్ ఫలితాలు 2023లో అద్భుతమైన ప్రతిభతో శ్రీ చైతన్య విద్యార్థులకు మరెవ్వరూ సాటిలేరని నిరూపించారని ఆ కళాశాళల ఎజిఎం మురళీకృష్ణ, డీన్‌లు సరళ , బాలాజీ తెలిపారు. మంగళవారం జెఇఇ మెయిన్స్ ఫలితాలు విడుదల చేశారు. తమ విద్యార్థి బి. జయసాయి 99. 35 పర్సెంటైల్ తో కర్నూలు జిల్లాలో అత్యధిక పర్సెంటైల్ సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచాడని, ఎన్.రాహిల్ 99.16, పి.జోయెల్ 98.63, జె. అక్షయరావు 1980, సి. సురేంద్ర 98.01, ఎమ్. విగ్నేశ్ ప్రసాద్ 97.64 , పి.కేదార్నాథ్ 96.83 , ఆర్. చక్రధర్ 96.76 , జె. దీపక్ 95.59, ఎం. రోహిత్ రెడ్డి 95.50 , జి. చార్మిబాయి 95.12 , బి.రోహిత్ 95.12 పర్సెంటైల్ లాంటి ఎన్నో ఉత్తమ పర్సెంటైల్స్ సాధించారని తెలిపారు. ఈ ఫలితాలు కేవలం కర్నూలు శ్రీ చైతన్య నుండి మాత్రమేనని వేరొక ప్రాంత ఫలితాలు కావని ఎజిఎం మురళీకష్ణ తెలిపారు. కళాశాలలో జరిగిన అభినందన సభలో ఈ ఉత్తమ ఫలితాలు. సాధించిన విద్యార్థులను అభినందించారు. 99 ఆ పైన పర్సెంటైల్ సాధించిన విద్యార్థులు-ఇద్దరు, 98 ఆ పైన పర్సెంటైల్ సాధించిన విద్యార్థులు-ఐదుగురు, 97 ఆ పైన పర్సెంటైల్ సాధించిన విద్యార్థుల -ఆరుగురు, 96 ఆ పైన పర్సెంటైల్ సాధించిన విద్యార్థుల -ఎనిమిది, 95 ఆ పైన పర్సెంటైల్ సాధించిన విద్యార్థులు- 12 మంది, 90 ఆ పైన పర్సెంటైల్ సాధించిన విద్యార్థులు- 27 మంది ఉన్నారని తెలిపారు.

ర్యాంకులు సాధించిన విద్యార్థులతో ఎజిఎం మురళీకృష్ణ, డీన్ సరళ

బాలోత్సవం లోగో ను ఆవిష్కరించిన కలెక్టర్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఆనందం..ఉత్సాహం..ఉల్లాసం...అన్న నినాదంతో నిర్వహించబోతున్న బాలోత్సవం-2023 పిల్లల పండుగ లోగోను జిల్లాకలెక్టర్ కోటేశ్వరరావు తన కార్యాలయంలో మంగళవారం ఉదయం ఆవిష్కరించారు. ఈ చిన్నారుల పండుగ విజయవంతమవ్వాలని ఆకాంక్షించారు. లోగో ఆవిష్కరణ కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి జెఎన్ శేషయ్య, నిర్వహణ కమిటీ ప్లానింగ్ కన్వీనర్ కెంగార మోహన్, కల్చరల్ కన్వీనర్ ఎంపి బసవరాజు, కమిటీ సభ్యులు ఉమ(కెసిసి), జె.రంగస్వామి (సుందరయ్య స్ఫూర్తి కేంద్రం) తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్పెల్ బి పోటీలు

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్ : నగరంలోని రవీంద్ర సాయి సుబ్బయ్య పాఠశాలలో మంగళవారం ఘనంగా స్పెల్ బి ఎక్స్‌పో పోటీలను నిర్వహించారు. కరస్పాండెంట్ పిపిబి సుబ్బయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిటైర్డ్ ప్రిన్సిపల్ డాక్టర్ కె చెన్నయ్య మాట్లాడుతూ ఆంగ్ల భాష పై విద్యార్థులు పట్టు సాధించాలన్నారు. మాతృభాషను మాత్రం నిర్లక్ష్యం చేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

సమావేశంలో మట్లాడుతున్న ఎంఇఒ జ్యోతి , వేదికపై ఎంపిడిఒ రాముడు

నాడు నేడు పనులను వేగవంతం చేయాలి

ప్రజాశక్తి- సి బెళగల్

మండలంలో రెండో విడత నాడు నేడు పనులను వేగవంతం చేయాలని ఎంపిడిఒ రాముడు, ఎంఇఒ జ్యోతి సంబందించిన హెచ్‌ఎమ్‌లకు సూచించారు. మంగళవారం విద్యావనరుల కేంద్రంలో సమీక్షించి మాట్లాడారు. రెండో విడత పనులు సంతృప్తికరంగా లేవని, అందుకు కమిటీ అలసత్వం అని పేర్కొన్నారు. నిధులు అంచలంచెలుగా ఖాతాలో జమ అవుతాయని పనులను సత్వారమే పూర్తి చేసే దిశగా సాగించాలని కోరారు.

జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ 'ఉపాధి'

- డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి

ప్రజాశక్తి - దేవనకొండ

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న పీడీ అమర్‌నాథ్ రెడ్డి

గ్రామాల్లో ప్రజలు వలసలు వెళ్లకుండా జాబ్ కార్డు కలిగిన ప్రతి కూలీకీ ఉపాధి కల్పించాలని డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి సిబ్బందికి సూచించారు. మంగళవారం మండలంలోని పి.కోటకొండ గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం సిఎల్ఆర్‌సి భవనంలో ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి చివరి నాటికి 500 కుటుంబాలకు 100 రోజులు పూర్తి చేయించాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలోనూ 20 ఎకరాలకు తక్కువ కాకుండా హార్టికల్చర్, మునగ, గులాబీ, మల్లె పంటలు వేసుకునే ఆసక్తి ఉన్న రైతులను గుర్తించాలని సూచించారు. అలాగే ఇప్పటి నుంచి వేతనదారులకు ఆధార్ అనుసంధానంతో ఉన్న బ్యాంకు అకౌంట్ ఉంటేనే వేతనాలు జమ అవుతాయని తెలిపారు. ఎపిఒ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

భవిష్యత్తు మనదే... అధైర్య పడకండి

- టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ

ప్రజాశక్తి - చిప్పగిరి

కోట్ల సుజాతమ్మకు స్వాగతం పలుకుతున్న నాయకులు

'భవిష్యత్తు కాలం మనదే. ఏ ఒక్క టిడిపి కార్యకర్త కూడా అధైర్య పడవద్దు' అంటూ టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ సూచించారు. మంగళవారం చిప్పగిరిలో పెల్లిళ్లి నరసింహులు నిర్వహించిన పెద్దమ్మ అవ్వ దేవరకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమె చిప్పగిరికి వచ్చిన సందర్భంగా మాజీ జడ్‌పిటిసి మీనాక్షి నాయుడు, మాజీ వైస్ ఎంపిపి వెంకటేశులు, ఎంపిటిసి రజిని, టిడిపి సీనియర్ నాయకులు నగరడోనా కిష్టప్ప, కొంగనగుర్తి సర్పంచి కొండా పురుషోత్తం, గోవిందు, సురేష్‌లు ఘనంగా స్వాగతం పలికి శాలువా, పూలమాల వేసి సన్మానించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. గత మూడున్నర ఏళ్లలో ఏ గ్రామంలోనూ అభివృద్ధి జాడ లేదన్నారు. రాబోయే కాలంలో ప్రతి టిడిపి కార్యకర్త కూడా సైనికునిలా పని చేసి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. అభివృద్ధి ఎలా ఉంటుందో వారి కళ్లకు చూపిస్తామన్నారు. మండల ఉపాధ్యక్షులు సతీష్, టిడిపి సీనియర్ నాయకులు తిమ్మయ్య, కరి గోవిందు, గుమ్మనూరు అంపయ్య, దౌల్తాపురం రామాంజిని, నరసింహులు, అంజి, అమరేష్, జయన్న, పాల్గొన్నారు.

దేవాలయానికి 5 సెంట్ల స్థలం విరాళం

ప్రజాశక్తి - కౌతాళం

స్థలాన్ని విరాళంగా ఇస్తున్న దాతలు

శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానానికి ఐదు సెంట్ల స్థలం విరాళం ఇచ్చినట్లు దేవాలయ సీనియర్ అసిస్టెంట్ కిరణ్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడారు. బెంగళూరుకు చెందిన ఎంబి.వేణుగోపాల్ కుమారులు చంద్రకాంత్, దేవానంద్‌లు కోసిగి రోడ్డులో గుడారం తాత ఆశ్రమం సమీపంలో ఉన్న స్థలాన్ని విరాళంగా ఇచ్చినట్లు తెలిపారు. వారి పేరున దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి, శేష వస్త్రాలు అందజేసినట్లు చెప్పారు. పుణ్యక్షేత్రంలో రాజగోపురం నిర్మాణంతో పాటు అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, భక్తులు విరాళాలు అందించి అభివృద్ధిలో పాలుపంచుకోవాలని కోరారు. దేవాలయ అధికారులు కుమార్, విజయ్, సిబ్బంది రాజు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో వైద్యమందేలా చర్యలు తీసుకోవాలి

- జనసేన నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

వైద్యాధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న జనసేన నాయకులు

పట్టణంలోని రాయ్ నగర్ పైకొట్టాల సమీపంలో నిర్మించిన రూరల్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో ప్రజలకు వైద్యమందేలా చర్యలు తీసుకోవాలని జనసేన నాయకులు ఎం.తాహేర్ వలీ డిమాండ్ చేశారు. మంగళవారం హెల్త్ సెంటర్‌ను జనసేన నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా తాహేర్ వలీ మాట్లాడారు. రూరల్ అర్బన్ హెల్త్ సెంటర్ ప్రారంభించి రెండు నెలలు గడుస్తున్నా ఇక్కడ వైద్య సిబ్బంది కానీ, వైద్యులు కానీ లేరని తెలిపారు. వెంటనే ప్రజలకు ప్రాథమిక వైద్యం అందించేందుకు వైద్యులను, వైద్య సిబ్బందిని, వైద్య పరికరాలను వెంటనే సమకూర్చాలని కోరారు.

కూరగాయల మార్కెట్‌లో సౌకర్యాలు నిల్

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వ్యాపారులు, వినియోగదారులు - పట్టించుకోని మేజర్ పంచాయతీ అధికారులు

ప్రజాశక్తి - హొళగుంద

హొళగుంద కూరగాయల సంత మార్కెట్ అసౌకర్యాల నడుమ నడుస్తోంది. వ్యాపారులు, వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా మేజర్ పంచాయతీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

హొళగుందతోపాటు 15 గ్రామాల ప్రజలు ఈ మార్కెట్‌లోనే కూరగాయలు కొనుగోలు చేస్తుంటారు. ఇక్కడ కనీస సౌకర్యాలు కూడా లేవు. గతేడాది ఆగస్టు, సెప్టెంబర్‌లో వర్షాలు అధికంగా కురవడంతో మార్కెట్‌లో గుంతలు ఏర్పడ్డాయి. కనీసం గ్రావెల్ వేయలేని పరిస్థితిలో మేజర్ పంచాయతీ అధికారులు ఉన్నారంటే అభివృద్ధిపై ఎంత శ్రద్ధ ఉందో అర్థమవుతుంది. కూరగాయల మార్కెట్ ద్వారా వచ్చే ఆదాయం మేజర్ పంచాయతీకి చేరుతుంది. ప్రతి ఏడాది మార్కెట్‌కు టెండర్ కూడా పిలుస్తారు. వచ్చిన ఆదాయంలో మార్కెట్ అభివృద్ధి కోసం వెచ్చించకపోవడం దురదృష్టకరమని వినియోగదారులు వాపోతున్నారు. పంచాయతీ అధికారికి, సర్పంచికి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కూరగాయలను కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

కనీస సౌకర్యాలు నిల్...

కూరగాయల మార్కెట్‌లో వ్యాపారులు సొంత ఖర్చులతో టెంట్లు ఏర్పాటు చేసుకున్నారు. మార్కెట్ ద్వారా వచ్చిన ఆదాయాన్ని మాత్రం మేజర్ పంచాయతీ అధికారులు తీసుకుంటున్నారు. గతేడాది అధిక వర్షాలు కురిసినా, వ్యాపారులు ఏర్పాటు చేసుకున్న టెంట్లు కారినా వర్షంలోనే వ్యాపారం చేసుకుంటున్నారు. పరిస్థితి పంచాయతీ అధికారులకు కళ్లెదురుగా కనిపిస్తున్నా రోడ్డుకిరువైపులా గ్రావెల్ వేయాలన్న ఆలోచన కూడా రాకపోవడం బాధాకరమని వ్యాపారులు పేర్కొంటున్నారు.

మార్కెట్‌లో వెదజల్లుతున్న దుర్వాసన

టెంట్లు వేసుకుని వ్యాపారాలు చేస్తున్న వ్యాపారాలు

కూరగాయల మార్కెట్‌లో దుర్వాసన వెదజల్లుతోందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఇక్కడ చికెన్, మటన్ షాపులు ఉండడం, రాత్రి వేళలో పందులు, పశువులు సంచరిస్తుండడంతో కూరగాయల మార్కెట్‌లో దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు కుట్టి డెంగీ, మలేరియా వంటి రోగాల బారిన పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కూరగాయల మార్కెట్‌లో గ్రావెల్ వేసి, ప్రజల సౌకర్యార్థం శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

'ఐక్యతతో సమస్యలు పరిష్కరించుకోవాలి'

ప్రజాశక్తి - దేవనకొండ

గ్రామ రెవెన్యూ అధికారులు విధుల్లో ఏర్పడే సమస్యలను ఐక్యతతో పరిష్కరించుకోవాలని ఎపిఆర్ఎస్ఎ జిల్లా అధ్యక్షులు గిరి కుమార్ రెడ్డి, ఆదోని, పత్తికొండ డివిజన్ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, నాగరాజు తెలిపారు. మంగళవారం స్థానిక సిఎల్ఆర్‌సి భవనంలో రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా దాదావలీ, కార్యదర్శిగా జాకీర్, గౌరవాధ్యక్షులుగా రాజన్న, ఉపాధ్యక్షులుగా షేకన్న, కోశాధికారిగా సూర్యుడు, సహాయ కార్యదర్శిగా చరిత, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా సుంకన్న, తేజస్విని, సలోమిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎపి ఆర్ఎస్ఎ డివిజన్ నాయకులు మల్లికార్జున, వలీబాష, సుదర్శనం, నబీసాబ్, నాగరాజు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను చెల్లించి అభివృద్ధికి సహకరించాలి

- రెవెన్యూ సెక్షన్ ఆఫీసర్ అస్లాం బాషా

ప్రజాశక్తి - ఆదోని

సకాలంలో ఆస్తి పన్ను చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్ అస్లాం బాష కోరారు. సకాలంలో చెల్లింపు వల్ల కలిగే ప్రయోజనాల గురించి పారిశ్రామిక, వ్యాపార వేత్తలకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆదోని మున్సిపాలిటీ పరిధిలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్ను రూ.17 కోట్లు వసూలు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇప్పటివరకు రూ.8.60 కోట్లు వసూలు చేశామని తెలిపారు. మొండి బకాయిదారులు, సకాలంలో పన్ను చెల్లించని వారి వివరాలు సేకరించి నోటీసులు ఇస్తున్నామని చెప్పారు. సచివాలయం పరిధిలోని పన్ను చెల్లింపు కోసం ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. టీంగా వెళ్లి పన్ను వసూలు చేస్తున్నామని తెలిపారు. మార్చి చివరిలోపు లక్ష్యాన్ని చేరుకునేలా ప్రణాళిక ఏర్పాటు చేసుకున్నామన్నారు. నీటి పన్ను రూ.8 కోట్లు వసూలు లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటివరకు రూ.3.50 కోట్లు వసూలు చేసినట్లు తెలిపారు. ప్రతేడాది ఏప్రిల్ మాసంలోనే ముందస్తుగా పన్ను చెల్లిస్తే అలాంటి వారికి 5 శాతం రాయితీ సదుపాయం అందుబాటులో ఉందన్నారు. జూన్‌లో పన్ను మొత్తం చెల్లిస్తే వడ్డీ మినహాయింపు సదుపాయం కూడా అమలులో ఉందని తెలిపారు. పట్టణ వాసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సకాలంలో పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు లవకుమార్, శ్రీనివాసులు, సూరిబాబు ఉన్నారు.

వ్యాపారవేత్తలకు అవగాహన కల్పిస్తున్న రెవెన్యూ సెక్షన్ ఆఫీసర్

రాబోయే ఎన్నికల్లో వైసిపిదే విజయం

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు

ప్రజాశక్తి-ఆలూరు

గృహ సారథుల శిక్షణలో మాట్లాడుతున్న మంత్రి గుమ్మనూరు జయరాం

ప్రతిపక్ష పార్టీలను భూస్థాపితం చేసి రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో వైసిపి విజయ సాధిస్తుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం తెలిపారు. మంగళవారం ఆలూరులోని ఇబ్రహీం ఫంక్షన్ హాలులో ఆస్పరి, దేవనకొండ మండలాల ప్రజా ప్రతినిధులు, నాయకులు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్ల శిక్షణలో 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి గుమ్మనూరు జయరాం హాజరయి మాట్లాడారు. ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాల వైపు పక్క రాష్ట్రాలు చూస్తున్నాయని తెలిపారు. నియోజకవర్గంలో జూన్, జులై నాటికి ప్రధాన రోడ్లు పూర్తి చేస్తామన్నారు. పార్టీ గెలుపునకు ఇప్పటి నుంచే ప్రతిఒక్కరు ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై తెలియజేయాలని సూచించారు. భవిష్యత్తులో మళ్లీ వైసిపి గెలుస్తుందన్నారు. మంత్రి సోదరులు నారాయణ స్వామి, శ్రీనివాసులు, జడ్‌పిటిసిలు దొరబాబు, రామకృష్ణ (కిట్టు), ఎంపిపిల భర్తలు రామాంజనేయులు, లుమాంబ, మారయ్య, సొసైటీ ఛైర్మన్ గోవర్ధన్, మండల కన్వీనర్లు పెద్దయ్య, కప్పట్రాళ్ల మల్లికార్జున, వీరేష్, జిల్లా కెడిసిసి డైరెక్టర్ రాఘవేంద్ర, మాజీ జడ్‌పిటిసి రాంభీం నాయుడు, వైసిపి నాయకులు మల్లికార్జున రెడ్డి, వెంకన్న, రాఘవేంద్ర, రాజారెడ్డి పాల్గొన్నారు.

గెలుపే ధ్యేయంగా పని చేయాలి

- వైసిపి ఇన్‌ఛార్జీ జయమనోజ్‌రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

2024లో వైసిపి గెలుపే ధ్యేయంగా పని చేయాలని కౌన్సిలర్లు, గృహ సారథులకు, కన్వీనర్లకు వైసిపి నియోజక వర్గ ఇన్‌ఛార్జీ జయ మనోజ్ రెడ్డి సూచించారు. పట్టణంలోని ద్వారక ఫంక్షన్ హాలులో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన దేశానికే ఆదర్శమన్నారు. అభివృద్ధిలో కూడా రాష్ట్రం దూసుకుపోతుందని తెలిపారు. రాష్ట్రంలోని ప్రజలు జగన్మోహన్‌రెడ్డి వెంట ఉంటారని చెప్పారు. మండల కన్వీనర్లు వెల్లాల మధుసూదన శర్మ, ఫయాజ్ అహ్మద్, వైసిపి సోషల్ మీడియా కన్వీనర్ శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జయమనోజ్ రెడ్డి

ఎంపికైన వారిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి పోటీలకు మున్సిపల్ విద్యార్థినులు

ప్రజాశక్తి - ఆదోని

ఇటీవల కర్నూలులో జరిగిన జిల్లా వైజ్ఞానిక సదస్సులో మున్సిపల్ స్కూలు విద్యార్థులు ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున తెలిపారు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. నమూన్, ఉమ్మి హబీబా, నందినిలు పరిశుభ్రత, శుద్ధ జలంపై రూపొందించిన ప్రయోగ నమూనాలు రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం గర్వించదగ్గ విషయమన్నారు. విద్యార్థులకు తర్ఫీదును ఇచ్చిన సైన్స్ టీచర్ రవిని అభినందించారు. ఉపాధ్యాయులు గిరిబాబు, సతీష్, దస్తగిరి, రామయ్య, సుశీలమ్మ, విజయ భారతి, చంద్రవతి, నూర్జహా పాల్గొన్నారు.

రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందే...

- వికలాంగునికి ఉన్న చిత్తశుద్ధి సిఎంకు లేదు

- టిడిపి నాయకులు

వికలాంగుని అభినందిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని, వికలాంగునికి ఉన్న చిత్తశుద్ధి ముఖ్యమంత్రి జగన్‌కు లేదని టిడిపి నాయకులు మండిపడ్డారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని, విశాఖపట్నానికి రైల్వే జోన్ ప్రకటించాలని శ్రీకాకుళం జిల్లా కంచిలి మండలం బైరుగం గ్రామానికి చెందిన వికలాంగుడు ప్రసాద్ ఇచ్ఛాపురం నుంచి అనంతపురం వరకు మూడు చక్రాల సైకిల్ యాత్ర నిర్వహిస్తున్నారు. మంగళవారం ఈ యాత్ర ఎమ్మిగనూరు చేరుకుంది. మాజీ ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు నాయకులు ఆయనను అభినందించారు. టిడిపి నాయకులు గడ్డం నారాయణరెడ్డి, కలగొట్ల శంకర్ గౌడ్, సోమనూరు రాఘవేంద్ర, జగదీష్ బాష పాల్గొన్నారు.

'పాలపుంత' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

పెద్దకడబూరు మండలం హెచ్.మురవణి ఉన్నత పాఠశాలలో గణితోపాధ్యాయులుగా పనిచేస్తున్న ప్రముఖ బాలసాహిత్యవేత్త గద్వాల సోమన్న రచించిన 'పాలపుంత' బాలగేయాల సంకలనం డాక్టర్ బ్రహ్మారెడ్డి ఆవిష్కరించారు. మంగళవారం కర్నూలు నగరంలోని బిర్లా కాంపౌండ్‌లో పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం బ్రహ్మారెడ్డి మాట్లాడారు. అనతి కాలంలోనే 30 పుస్తకాలు ప్రచురించడం, బాలసాహిత్యంలో విశిష్ట సేవలను కొనియాడారు. నిఖిలేష్ ఎడ్యుకేషనల్ అకాడమీ అధ్యక్షులు మద్దులేటి, నల్లమల ప్రకాష్ రాజు, హెచ్ఇఒ డాక్టర్ సౌదాకర్ రాజు, కృపరాజు, దాని, స్వరూప్ సిన్హా, నాగేశ్వరరావు, ఆవుల చక్రపాణి పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బ్రహ్మారెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న రమీజాబీ

ఎఎన్ఎం ఆశాలతను సస్పెండ్ చేయాలి

- ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రమీజాబీ

ప్రజాశక్తి - కోసిగి రూరల్

కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎఎన్ఎంగా పని చేస్తున్న ఆశాలతను జిల్లా ఉన్నతాధికారులు వెంటనే సస్పెండ్ చేయాలని ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రమీజాబీ డిమాండ్ చేశారు. మంగళవారం కోసిగిలో ఆశా వర్కర్స్ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఆశా వర్కర్లు రూ.10 వేలు ఇవ్వాలని, గర్భిణుల నుంచి రూ.500 వసూలు చేసి ఇవ్వాలని ఎఎన్ఎం ఆశాలత ఆశా వర్కర్లను ఒత్తిడి చేశారని తెలిపారు. ఎందుకు ఇవ్వాలని చిర్తనకల్లు గ్రామానికి చెందిన ఆశా వర్కర్ కుమారుడు అడిగినందుకు ఆశావర్కర్‌ను, ఆమె కుమారుని దుర్భాషలాడి కొట్టారని తమ దృష్టికి వచ్చినట్లు చెప్పారు. జిల్లా ఉన్నతాధికారులు విచారణ జరిపి సస్పెండ్ చేయాలని కోరారు. మండల నాయకులు వెంకటమ్మ, సుజాత, సిఐటియు మండల ఉపాధ్యక్షులు వీరేష్, ఆశా వర్కర్ యూనియన్ మండల నాయకులు పార్వతి, శ్రీదేవి, సంధ్య, సుజాత, అరుణ, లక్ష్మీ, మంజుల పాల్గొన్నారు.

'ఆస్పత్రిలోనే ప్రసవాలు జరిగేలా చూడాలి'

ప్రజాశక్తి- దేవనకొండ

ప్రతి గర్భిణీ ఆస్పత్రిలోనే ప్రసవం అయ్యేలా చూడాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి సాయిబాబా, హెల్త్ ఎడ్యుకేటర్ ఈశ్వరయ్య, సిహెచ్ఒ భాగ్యలక్ష్మి తెలిపారు. మంగళవారం ఆశాడే సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రతి హైరిస్క్ కేసును వారం, వారం విజిట్ చేయాలని సూచించారు. టిబి, లెప్రసీ కేసులను సకాలంలో గుర్తించి పిహెచ్‌సి డాక్టర్ చేత పరీక్ష చేయించాలని తెలిపారు. గ్రామంలో జ్వరం వచ్చిన ప్రతి వ్యక్తీ రక్త పరీక్షలు తీసి సకాలంలో రిపోర్ట్ చేయాలని చెప్పారు. హెల్త్ సూపర్ వైజర్లు హనుమంతమ్మ, ఉమాదేవి, రామ్మోహన్ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు లింగన్న

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఉపాధి కూలీలకు అందాల్సిన గత నవంబర్, డిసెంబర్, జనవరి నెలల్లో 10-12 వారాల ఉపాధి వేతనాలు సుమారు రూ.కోటి వెంటనే చెల్లించాలని వ్యకాస జిల్లా ఉపాధ్యక్షుల కె.లింగన్న డిమాండ్ చేశారు. మంగళవారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో ఎపిఒ చక్రవర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లింగన్న, వ్యకాస మండల కార్యదర్శి డి.రామాంజనేయులు మాట్లాడారు. కష్టపడి పని చేసిన కూలీలకు వేతనాలు అందించడంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు అనేక కుట్రలు పన్నుతోందని తెలిపారు. అందుకే వేతనాలను పెండింగ్‌లో పెడుతోందన్నారు. బడా కార్పొరేట్ సంస్థలకు రూ.లక్షల కోట్లు ధారాదత్తం చేస్తున్న మోడీ ప్రభుత్వం, ఉపాధి కూలీలకు మాత్రం వేతనాలు అందించడం లేదని విమర్శించారు. నిబంధనల పేరుతో ఉపాధి కూలీలను వేధిస్తున్నారని, రెండుసార్లు ఫొటో నిబంధన ఎత్తేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే 100 రోజులు పూర్తి చేసుకున్న కుటుంబాలు పనుల్లేక వలసలు వెళ్తున్నాయని, ఉపాధి పని దినాలను 200 రోజులకు పెంచాలని కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనం రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారందరికీ జాబ్ కార్డులు అందించాలని కోరారు. డివైఎఫ్ఐ మండల కార్యదర్శి ఉచ్చీరప్ప, వ్యకాస మండల కమిటీ సభ్యులు గోవిందు, అబ్దుల్ రహీం, గోపాల్, శంకరప్ప, యు.తాయప్ప, రూబెన్ పాల్గొన్నారు.



ఎపిఒకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పిఆర్‌సిని అమలు చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - హొళగుంద

పిఆర్‌సిని వెంటనే అమలు చేయాలని, సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హెచ్‌వై.శేషాద్రి, ఎ.వెంకటరమణ డిమాండ్ చేశారు. మంగళవారం హొళగుంద ప్రాథమిక పాఠశాల (మెయిన్)లో యుటిఎఫ్ జిల్లా నాయకులు జి.వెంకటేష్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ మండల కమిటీని ఎన్నుకున్నారు. యుటిఎఫ్ మండల గౌరవాధ్యక్షులు పి.కబీర్ సాబ్, అధ్యక్షులుగా హెచ్‌వై.శేషాద్రి, సహాధ్యక్షులుగా ఎస్ఇ.సురేంద్ర గౌడ్, బి.రేణుక, ప్రధాన కార్యదర్శిగా వెంకటరమణ, ఆర్థిక కార్యదర్శిగా విశ్వనాథ, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా పరమేష్, జ్యోతి, తేజప్ప, హుస్సేన్ వలీ, ఆంజు నాయక్, మండల కార్యదర్శిగా లక్ష్మణ, సోమప్ప, నాగరాజు, విజయమ్మ, గురు బసవరాజు, వీరేష్, రామకృష్ణ, దీప్తి, పోతులూరి, స్వాతి, మహిళా విభాగ కన్వీనర్‌గా సుమలత, అకాడమీ విభాగ కన్వీనర్‌గా పద్మావతి, సాంస్కృతిక విభాగంగా కన్వీనర్‌గా ఈరమ్మ, ఆడిట్ కన్వీనర్‌గా వెంకటేశ్వర్లు, సిపిఎస్ సబ్ కమిటీ సభ్యులుగా రాజనాయక్, చంద్రమౌళి, రామలక్ష్మమ్మలను ఎన్నుకున్నారు.

విధులపై ప్రాధాన్యత పెంచుకోండి

- ఎంపిడిఒ సుధాకర్ రాజు

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రభుత్వం అప్పజెప్పిన విధులకు ప్రాధాన్యత ఇచ్చి సమస్యలు రాకుండా చూసుకోవాలని ఎంపిడిఒ సుధాకర్ రాజు సచివాలయ సిబ్బందికి, గ్రామ వాలంటీర్లకు సూచించారు. మంగళవారం బెల్డోనా సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి నరేంద్ర ఆధ్వర్యంలో ఇఒఆర్‌డి సంజన అధ్యక్షతన సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమయపాలన పాటించి సచివాలయానికి ఏ సమస్య వచ్చినా వెంటనే పరిష్కరించేలా చూసుకోవాలన్నారు. సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

26 మంది వాలంటీర్లకు తొలగింపు షోకాస్ నోటీసులు

మండలంలోని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శుల సిఫార్సుల మేరకు 26 మంది వాలంటీర్లకు తొలగింపు షోకాస్ నోటీసులు అందజేసినట్లు ఎంపిడిఒ సుధాకర్ రాజు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలు పాటించకుండా, ఉన్నతాధికారులు సమావేశం నిర్వహించినా, వారు విధులను సక్రమంగా నిర్వహించని వాలంటీర్లకు తొలగింపు షోకాస్ నోటీసులు అందజేశామన్నారు.

'పది'లో ఉత్తీర్ణత శాతం పెంపునకు చర్యలు

- ఎస్ఎస్ఎ ఎపిసి వేణుగోపాల్

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలో పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ, చర్యలు చేపట్టి ఉత్తీర్ణత శాతం పెంపునకు కషి చేయాలని సమగ్ర శిక్ష అభియాన్ జిల్లా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ డాక్టర్ కె.వేణుగోపాల్, ఎంఐఎస్ ప్లానింగ్ కోఆర్డినేటర్ మారుతి తెలిపారు. మంగళవారం గోనెగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను వారు సందర్శించారు. పాఠశాలలో నాడు-నేడు పనులను పరిశీలించి, పనుల పురోగతిపై చర్చించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల్లో పురోగతిని పెంచేందుకు ప్రేరణ కలిగించే విషయాలను, విద్య ఆవశ్యకతను, ఉపాధ్యాయుల పాత్రను వివరించి తగిన సూచనలు ఇచ్చారు. ఉపాధ్యాయులు శ్రద్ధతో ప్రత్యేక తరగతులు, రివిజన్ టెస్టులు, డైలీ టెస్టులు లాంటి ప్రత్యేక చర్యలతో రానున్న పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెంపునకు కృషి చేయాలని ఆదేశించారు. ఎంఇఒ కె.వినోద్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగభూషణం, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ పాముల ఉస్మాన్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎపిసి వేణుగోపాల్

IN THE COURT OF THE PRINICIPAL JUNIOR CIVIL JUDGE: ALUR
O.S.No. 46/2007

BETWEEN:
K.M.SHARADA & OTHER'S. ...Plaintiff
V/S
K.M.Nataraja and others. ...Defendant

NOTICE TO THE LEGAL HEIRS OF K.M.GAVISIDDAPPA:

Respondants No.2 (a) Smt. Uma Maheshwari
Wife of K.M.GAVISIDDAPPA
Aged about 62 years,
Respondants No.2(b) Smt. Manjula
D/o K.M.GAVISIDDAPPA W/O Shanthamurthy
Aged about 45 years,
Respondants No.2(c) Vasanth kumar
S/o K.M.GAVISIDDAPPA Aged about 42 years,
Respondants No.2(d) Manjuantha
S/o K.M.GAVISIDDAPPA Aged about 40 years,
all are Hindus,
R/O M.I.G.No. 61, A.P.H.B.Colony, Adoni

Whereas, the above named plaintiffs have filed suit against K.M.Gavisiddaiah, seeking declaration of the suit schedule properties.

As K.M.GAVISIDDAPPA is expired, the plaintiff / petitioners have filed this petition to bring the legal heirs of the K.M.GAVISIDDAPPA on record.

You all being the legal heirs of the K.M.GAVISIDDAPPA are hereby directed to appear in the court either in person or by a pleader duly instructed on 14/03/2023 at about 10.30 A.M. in the forenoon before this Honourable court to show cause against the above petition, failing wherein the petition will be heard and determined ex-parte.

Given under my hand and seal of this court on this February 2023

Jelle Hanumanthappa — By order of the court.
Advocate for the Plaintiffs

వివరాలను పొందుపరచి న్యాయం చేయాలి

- అధికారికి బాధితుల వినతి

ప్రజాశక్తి - ఆదోని

డివిజన్ పరిధిలోని కల్లుకుంట గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 174/1లో గల 7.60 సెంట్ల భూమికి సంబంధించిన వివరాలు ఆన్‌లైన్‌లో పొందపరచి న్యాయం చేయాలని పెద్దకడుబూరు మండలం కల్లుకుంట గ్రామానికి చెందిన కొత్త కురువ రమేష్, కురువ సావిత్రమ్మ, కొత్త కురువ నరసప్ప, కురువ తాయమ్మ, కొత్త కురువ మారెమ్మ కోరారు. మంగళవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఖాతా నెంబర్లు 87, 198, 357, 384, 503లో గల సదరు భూమి తమకు వారసత్వంగా సంక్రమించిందని తెలిపారు. ప్రభుత్వ పథకాలైన రైతు భరోసా, వ్యవసాయ పంట రుణాలు, సబ్సిడీ, ఎరువులు, విత్తనాలు పొంది సదరు భూమిని సాగు చేసుకొని జీవనం సాగిస్తున్నామన్నారు. గత 4 నెలల నుంచి ప్రభుత్వ వెబ్ ల్యాండ్‌లో భూమికి సంబంధించిన వివరాలు ఆన్‌లైన్ అడంగల్ 1బి, ప్రింట్ రాకుండా వెబ్ ల్యాండ్‌లో పెద్దకడుబూరు తహశీల్దారు లాక్ చేశారని తెలిపారు. విషయాన్ని వారికి దృష్టికి తీసుకెళ్లినా 'అదిగో...ఇదిగో' అంటూ కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. తమ భూమి వివరాలు ఆన్‌లైన్‌లో 1బి అడంగల్ వచ్చేలా చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరారు.

అధికారికి వినతి పత్రం అందజేస్తున్న బాధితులు

YEMMIGANUR MUNICIPALITY
e-Procurement tender Notice

Notice No. 27/General Fund/2022-23/E1(2nd Call), dt.07.02.2023

1	Total No. of Work	2nd Call- 2 Nos.
2	Value of Work	3.35 Lakhs
3	Bid document download starting date	08-02-2023 at 10.30 A.M
4	Bid document download end date	15-02-2023 at 3.00 P.M
5	Last Date & Time for receipt of Bids	15-02-2023 at 3.30 P.M
6	Commercial Bid opening Date	15-02-2023 at 4.00 P.M
7	Name & Address of the Concerned Officer	Commissioner, Yemmiganur Municipality, Yemmiganur. Ph.No.08512-255050 Fax : 08512-228050 Email: commissioner_ygr@yahoo.com

The details of name of work, Tender document, Eligibility Criteria. Bid Submission & Price Bid opening date and EMD details etc., may be seen on e-procurement market place available @ eprocurement.gov.in

Municipal Commissioner
Yemmiganu Municipality.

ప్రజాశక్తి
www.prajasakti.com

ఘనంగా దేవర ఉత్సవాలు

ప్రజాశక్తి - అవుకు

మండలంలోని మన్నే నాయక్ తండా గ్రామంలో నిర్వహించిన మారెమ్మ, సేవాలాల్ దేవర ఉత్సవాలను మంగళవారం తండావాసులు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా టిడిపి సీనియర్ నాయకులు గూడాల మురళీధర్ రెడ్డి, ప్రతాప్ రెడ్డిలు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఎస్సై జగదీశ్వర్ రెడ్డి అల్లర్లు జరగకుండా బందోబస్తును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కునుకుంట్ల గ్రామ ఉపసర్పంచ్ రామకృష్ణారెడ్డి, పాల శ్రీనివాసులు, తండా గ్రామస్తులు పాల్గొన్నారు.

లెప్రసీ సర్వేలో నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి - గోస్పాడు

లెప్రసీ సర్వే నిర్లక్ష్యం వహించరాదని గోస్పాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ గోపాల్ ఆశా, ఆరోగ్య కార్యకర్తలకు సూచించారు. మంగళవారం ఆశా డే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 30 నుండి ఫిబ్రవరి 13 వరకు నిర్వహించే లెప్రసీ సర్వే పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, హెల్త్ డిక్టేటర్, హెల్త్ సూపర్వైజర్, మిడ్ డే లెవెల్ హెల్త్ ప్రొడ్యూసర్లు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి ఎన్నిక

ప్రజాశక్తి - నంద్యాల

ఐఎఫ్‌టియు ఉమ్మడి కర్నూల్ జిల్లా 4వ మహాసభలో నంద్యాల జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా మజీద్ మియ్యా, రంగనాయకులును ఎన్నుకున్నందుకు హర్షం వ్యక్తం చేస్తున్నామని డివిజన్ నాయకులు సులోచన తెలిపారు. మంగళవారం స్థానిక మీడియాతో ఆమె మాట్లాడారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఐఎఫ్‌టియు రాష్ట్ర, దేశ వ్యాప్తంగా ఎన్నో పోరాటాలు చేస్తుందని తెలిపారు. నాయకురాలు సునీత, సుబ్బమ్మ, లక్ష్మి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల వేలంలో రూ.4.12 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - మహానంది

మహానంది పోలీస్ స్టేషన్లో మంగళవారం నిర్వహించిన వాహనాల వేలం ద్వారా రూ.4.12 లక్షల ఆదాయం వచ్చినట్లు ఎస్ఐ నాగార్జున రెడ్డి తెలిపారు. ఎస్సై మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తులు నాలుగు ద్విచక్ర వాహనాలు, ఒక టిప్పర్, బొలెరో వాహనాన్ని మహానంది సమీపంలో వదిలిపెట్టి పోగా వాటిని స్వాధీనం చేసుకుని, పత్రికా ప్రకటనల ద్వారా యజమానులకు తెలియజేసినా స్పందన లేకపోవడంతో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వేలం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ నారాయణరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేటు ఉపాధ్యాయుల జీవితాలకు భద్రత, భరోసా కల్పించాలి

ప్రజాశక్తి - బనగానపల్లె

ఆగమ్య గోచరంగా మారిన ప్రైవేటు ఉపాధ్యాయుల జీవితాలకు భద్రత, భరోసా కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని పెండేకంటి పాఠశాలతో పాటు పలు ప్రైవేటు పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ప్రైవేట్ ఉపాధ్యాయుల సమస్యల గురించి వారితో చర్చించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్జేయుపి రాష్ట్ర అధికార ప్రతినిధి ముత్తోజు వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నాయకురాలు మృతి

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని టంగుటూరు గ్రామానికి చెందిన టిడిపి నాయకురాలు సల్లా రేణుకమ్మ (54) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలిసిన మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిరా గ్రామానికి చేరుకుని ఆమె భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కుందూకు నీటిని విడుదల చేయాలి

- ఇరిగేషన్ అధికారులకు పరివాహక రైతన్నలు విజ్ఞప్తి

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

మండలంలోని కుందూ నదికి నీటిని విడుదల చేయాలని

పరివాహక రైతన్నలు కోరుతున్నారు. కుందూ నది వెంట రబీ సీజన్లో సాగు చేసిన వరి, మిర్చి, మొక్కజొన్న పంటలకు సాగునీరు అవసరం ఉందని, కెసి కెనాల్ అధికారులు కెనాల్‌కు మాత్రమే నీరు మళ్లిస్తున్నారు. కుందూ నది వెంట వేలాది ఎకరాల భూములకు మోటార్ల ద్వారా సాగునీటిని అందించుకుంటూ రైతులు వ్యవసాయం చేస్తున్నారు. ప్రస్తుతం కుందూ నదికి నీటి ప్రవాహాన్ని తగ్గించిన ఇరిగేషన్ అధికారులు వెంటనే విడుదల చేసి రైతన్నలను ఆదుకోవాలని కోరుతున్నారు. పొట్ట, కరకు దశలో ఉన్న వరి పంటకు మోటార్లకు సాగునీరు అందక ఎండిపోతున్న పరిస్థితి ఉంది. వెంటనే కుందూ నదికి మోటార్లకు నీరు అందేలా విడుదల చేయాలని, సంత జూటూరు పికప్ ఆనకట్ట ద్వారా సాగునీటిని అందించాలని రైతులు కోరుతున్నారు.

సాగునీరు విడుదల చేయాలి

కుందూ నదికి వెంటనే సాగునీరు విడుదల చేయాలి. పరమటూరు, సంత జుటూరు, బండి ఆత్మకూర్, కాకునూరు, ఎర్రగుంట్ల గ్రామాలలో రైతులు వందలాది ఎకరాల్లో పంటలు సాగు చేశారు. కుందూ నదికి మోటర్లు వేసుకొని పంటలు పండిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, ఇరిగేషన్ అధికారులు నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలి.

- దేరెడ్డి మల్లికార్జున రెడ్డి, టిడిపి తెలుగు యువత నాయకుడు.

పంటలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటాం

కుందూ నది పరివాహక రైతుల ఆవేదన, పంటల పరిస్థితిని తెలుసుకున్న ఆయన వెంటనే స్పందిస్తూ పంటలకు సాగునీరు అందేలా చర్యలు చేపడతామని హామీనిచ్చిరు.

- కెసి కెనాల్ ఎఇ వెంకటేశ్వర్లు.

పంటలను కాపాడాలి

కుందూ నదికి సాగునీటిని విడుదల చేసి పంటలను కాపాడాలి. ప్రస్తుతం కరుకు, పొట్ట దశలో ఉన్న పంటలకు సాగునీరు అందించి ఆదుకోవాలి. సాగునీరు అందించకపోతే ఆందోళన బాట పట్టాల్సి వస్తుంది.

దేరెడ్డి నాగేశ్వర్ రెడ్డి, వైసిపి నాయకుడు, ఎర్రగుంట్ల గ్రామ వార్డు సభ్యుడు.

నిలిచిపోయిన విద్యార్థి బస్సు

- ఇబ్బందులు పడ్డ విద్యార్థులు

ప్రజాశక్తి - రుద్రవరం

రుద్రవరం మండల కేంద్రంలో మంగళవారం విద్యార్థి ఆర్‌టిసి బస్సు నిలిచిపోవడంతో గ్రామాలకు చేరుకోవడానికి విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. మండలంలోని మాచినేనిపల్లె, బి.నాగిరెడ్డిపల్లె గ్రామాల నుండి విద్యార్థులు ఆదర్శ పాఠశాలకు చేరుకునేందుకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించారు. మంగళవారం పాఠశాల ముగిసిన అనంతరం విద్యార్థులు గ్రామాలకు వెళ్లేందుకు బస్సులో ప్రయాణిస్తుండగా రుద్రవరంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల వద్దకు చేరుకోగానే బ్రేక్ డౌన్ కావడంతో డ్రైవర్ బస్సును అక్కడే నిలిపివేశాడు. వెనకాల కోటకొండకు వెళ్లాల్సిన విద్యార్థి బస్సు రావడంతో అందులో విద్యార్థులు వెళ్లాల్సి వచ్చింది. మాచినేనిపల్లె, బి,నాగిరెడ్డిపల్లె గ్రామాలకు చెందిన విద్యార్థులు గురప్పనిమాండ్ల మెట్ట వద్ద దిగి నడుచుకుంటూ గ్రామాలకు చేరుకున్నారు. మరమ్మతులు పూర్తి చేసుకొని ఉదయాన గ్రామాలకు విద్యార్థి బస్సు వస్తుందో లేదోనని, ఒకవేళ బస్సు రాకుంటే మెట్ట వరకు నడక తప్పదని విద్యార్థులు చెబుతున్నారు. సంబంధిత ఆర్టీసీ

రుద్రవరంలో ఆగిపోయిన విద్యార్థి బస్సు

అధికారులు స్పందించి బస్సుకు మరమ్మతులు చేపట్టి ఉదయాన సకాలంలో గ్రామాలకు బస్సు చేరుకునేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

డ్రైవర్ గారూ.. పరీక్షల సమయం.. బస్సు ఆపండి...

ప్రజాశక్తి -అవుకు

బస్సులు ఆపకుండా వెళ్లడంతో పరీక్షలకు ఆలస్యంగా హాజరవుతున్నామని, బస్సులు ఆపాలని మండలంలోని ఓబులాపురం గ్రామానికి చెందిన డిగ్రీ విద్యార్థులు ఆర్టీసీ అధికారులకు మొరపెట్టుకుంటున్నారు. వివరాలు.. మండలంలోని ఓబులాపురం గ్రామంలోని డిగ్రీ విద్యార్థులు బస్సు సౌకర్యం లేకపోవడంతో కాలినడకన అవుకు జలాశయం వరకు వచ్చి అక్కడి నుండి బస్సులో బనగానపల్లెకు వెళ్ళవలసి ఉంటుంది. అయితే మంగళవారం జలాశయం వద్ద బస్సు ఆపకపోవడంతో విద్యార్థులు ద్విచక్ర వాహనదారులను లిఫ్ట్ అడిగి అవుకు బస్టాండ్‌కు చేరుకున్నారు. బస్సు ఆపకుండా వెళ్లడం వలన పరీక్షా కేంద్రానికి ఆలస్యంగా వెళ్లామని విద్యార్థులు చెబుతున్నారు. పరీక్షల సమయం కావున బస్సులు ఆపే విధంగా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులను విద్యార్థులు కోరుతున్నారు.

వైసిపి నాయకుడిని పరామర్శించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని ఆంజనేయస్వామి దేవస్థానం సమీపంలో ఉన్న వైసిపి నాయకులు జాకీర్ హుస్సైన్‌ను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మంగళవారం పరామర్శించారు. జాకీర్ హుస్సేన్‌కు అన్ని విధాలా సహాయంగా వుంటామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఎవరెస్ట్ బాబు, డ్రైవరు బాబు, హాజీ హుస్సైన్, పెద్ద హాజీ హుస్సైన్ ,అలీ అబ్బాస్, ముర్తుజా హుస్సైన్, లియఖాత్ హుస్సైన్, సాబ్ జాన్ తదితరులు పాల్గొన్నారు.

వైసిపి నాయకులు జాకీర్ హుస్సైన్ పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

యాదవులు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలి

ప్రజాశక్తి - బనగానపల్లె

యాదవులు అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలని అఖిల భారత యాదవ మహాసభ బనగానపల్లె నియోజకవర్గ కన్వీనర్ మద్దయ్య యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని రామతీర్థం గ్రామంలో అఖిల భారత యాదవ మహాసభ మండల అధ్యక్షులు ఎర్రగుడి గణ మద్దిలేటి యాదవ్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షులుగా బొందెల గురు మోహన్ యాదవ్, ఉపాధ్యక్షులుగా దొరాసి ప్రతాప్ యాదవ్, తుపాకుల ప్రసాద్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా చాగలమర్రి దస్తగిరి బాబు యాదవ్, కార్యదర్శిగా తుపాకుల గోపాల్ యాదవ్, ట్రెజరర్‌గా పెండేకంటి గోవిందరాజులు యాదవ్, కమిటీ సభ్యులుగా దొరాసి రమేష్ యాదవ్, డొల్లు తిమ్మయ్య యాదవ్ తుపాకుల రాఘవేంద్ర యాదవ్, చింతా రమణ యాదవ్‌తోపాటు మరికొంతమందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు నందవరం బాల వెంకటేశ్వర్లు యాదవ్, ప్రధాన కార్యదర్శి రాళ్ల కొత్తూరు శంకర్ యాదవ్, కార్యదర్శులు పర్లపాటి గోపాల్ రాజ్ యాదవ్, శ్రీరాములు యాదవ్,

మాట్లాడుతున్న యాదవ సంఘం నియోజకవర్గ కన్వీనర్

కటకెవానికుంట చంద్రుడు యాదవ్, పలుకూరు రాం పుల్లయ్య యాదవ్, శ్రీనివాసులు యాదవ్, పిల్లి నాగయ్య యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

క్రీడాకారులను అభినందిస్తున్న టిజి.భరత్

జాతీయ కరాటేలో సత్తా చాటాలి

ప్రజాశక్తి- కర్నూల్ స్పోర్ట్స్

జిల్ల క్రీడాకారులు జాతీయ స్థాయిలో సత్తా చాటి పతకాలు సాధించాలని కర్నూలు నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి టిజి భరత్ అన్నారు. ఈ నెల 9 నుండి 12వ తేదీ వరకు విశాఖపట్నం స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియంలో జరిగే జాతీయ స్థాయి కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా చెందిన 10 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. టిజి. భరత్ మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారులును అభినందిస్తూ మన జిల్లాకు జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పతకాలు సాధించాలని అన్నారు. అనంతరం క్రీడాకారులకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారుల వివరాలు టి.జైయ్ రామ్ తేజ, వి.దినేష్, సి.లోకేష్ రెడ్డి, వి.జ్యోతి, ఎస్.సుమంత్ కుమార్, ఎస్.రయాన్‌బాషా, జి.ధనుంజయ్, ఎస్ ఎండి. జైద్‌బాషా, ఎస్ఎండి సాదుబాష, ఎం. క్రాంతి వెళు న్నారని. ఎస్.సామెల్. ఎంపికైనట్లు డైరెక్టర్ టి.శ్రీనివాసులు తెలిపారు.

ఉర్దూ టీచరును సన్మానిస్తున్న ఆవాజ్ కమిటీ నాయకులు

ఉర్దూటీచర్లకు సన్మానం

ప్రజాశక్తి-కోడుమూరు : కోడుమూరు పట్టణంలోని ఉర్దూ హై స్కూల్లో నూతనంగా నియమించిన టీచర్లకు మండల ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో సన్మాన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమం మండల ఆవాజ్ కమిటీ అధ్యక్షులు , జిల్లా మైనార్టీ డైరెక్టర్ డాక్టర్ షాకీర్ అహ్మద్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా వెల్ఫేర్ మైనార్టీ ఆఫీసర్ ఎం.మహబూబ్ బాషా, ఎంఇఒ అనంతయ్య, వక్ఫ్ బోర్డ్ మైనార్టీ డైరెక్టర్ జిలాని ఉర్దూ హై స్కూల్ హెడ్మాస్టర్‌అలీ, ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ మైనార్టీ ఆఫీసర్ మహబూబ్‌బాషా మాట్లాడుతూ కోడుమూరు పట్టణంలో త్వరలోనే ఉర్దూ ఇంటర్మీడియట్ కాలేజ్ ఉర్దూ హాస్టల్ నిర్మించ దానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల ఆవాజ్ కమిటీ ప్రెసిడెంట్లు పాల్గొన్నారు.

స్పెషల్ క్లాస్ లను తనిఖీ చేయండి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : వసతి గృహాల్లో 10 వ తరగతి విద్యార్థులకు వారు తక్కువ ఉన్న సబ్జెక్టులకు ఏర్పాటు చేసిన స్పెషల్ క్లాసులను అధికారులు తరుచుగా తనిఖీ చేయాలని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు సంక్షేమ శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ సంక్షేమ శాఖలపై సమీక్ష నిర్వహించారు. 10 వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన ఫార్మాటివ్ అసెస్మెంట్ టెస్ట్-1,2 మరియు సమ్మటివ్ టెస్ట్-1 లకు సంబంధించిన ఫలితాలను జిల్లా కలెక్టర్‌కు బిసి సంక్షేమ అధికారి వెంకటలక్ష్మమ్మ వివరించారు. సంక్షేమ వసతి గృహాల్లో చదివే విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు.

గృహ సారథులే రథసారథులు

పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

ప్రజాశక్తి-వెల్దుర్తి

రాబోయే 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి గెలుపునకు గృహ సారథులే రథసారథులని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. మంగళవారం పట్టణంలోని లిమ్రాస్ ఫంక్షన్ హాలులో వాలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు , గహ సారధుల సమావేశం మండల కన్వీనర్ రవి రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గహ సారధులందరూ ప్రతి ఇంటికి వెళ్లి లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి జగనన్న ప్రభుత్వంలో పొందిన మేలును తెలియజేయాలన్నారు. జగనన్న నాటి పాదయాత్రలో యిచ్చిన ప్రతి హామీని నెరవేర్చారన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి వాలంటీర్ల ద్వారా ప్రతి నిరుపేదకు సంక్షేమ పథకాలను అందిస్తూ ప్రజల హృదయాల్లో చెరగని ముద్రను సొంతం చేసుకున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో 175 సీట్లకు 175 సీట్లు సాధించి (క్లీన్ స్వీప్ చేసి) రెండోసారి అధికారంలోకి వస్తామని దీమా వ్యక్తం చేశారు.వైసీపీ పార్టీ సచివాలయ కన్వీనర్లకు మండల కన్వీనర్ గా దేశాయి సమీర్ కుమార్ రెడ్డి నియమితులయ్యారు. అంతకుముందు ఎమ్మెల్యేకు గజమాలతో నాయకులు

సమావేశంలో మాట్లాడుతున్న పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

సత్కరించారు. అనంతరం పట్టణంలో 15, 16 వార్డులలో గడప గడప కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు జడ్‌పిటిసి సుంకన్న, జగన్మోహన్ రెడ్డి, వైఎస్ ఎంపిపి చిన్నరంగడు, మాధాస్వామి, ఎల్లరాముడు, కృష్ణారెడ్డి, మధుసుదన్ రెడ్డి, శ్రీరామ్ రెడ్డి, కష్టారెడ్డి, కోటిరెడ్డి, అశోక్ రెడ్డి, ఎల్లస్వామి, రాధాకృష్ణారెడ్డి, శరబారెడ్డి, పరమేశ్వర రెడ్డి, అనంతరెడ్డి, వెంకటేశ్వర రెడ్డి , పెద్దిరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్త హీనత పరీక్షలు నిర్వహించాలి

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్ : జిల్లాలోని పాఠశాలలో చదివే విద్యార్థినిలకు తప్పనిసరిగా రక్తహీనత పరీక్షలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి కోటేశ్వరరావు ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ వైద్యారోగ్య శాఖ , ఐసిడిఎస్ శాఖలపై సమీక్ష చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ గర్భవతుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. గర్భవతుల ఇళ్లకు వెళ్లి మందులు పంపిణీ చేయడం, పోషకాహారం అందించడం, ప్రతినెల ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం, ఒక వారం ముందే ఆసుపత్రులకు చేర్పించి ప్రసవాలు చేయించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గర్భవతులకు ప్రభుత్వం అందించే సేవలను వినియోగించుకునేలా వారి కుటుంబ సభ్యులు కూడా సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. హై రిస్క్ గర్భిణుల పట్ల వైద్యాధికారులు, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు వచ్చే మార్చి ఒకటవ తేదీ నుంచి సాయంత్రం 5 నుంచి 8 గంటలవరకు ప్రత్యేకమైన క్లాసులు నిర్వహించాలన్నారు. ఆ సమయంలో పిల్లలు బలంగా ఉండేలా మల్టీ విటమిన్ టాబ్లెట్స్ ఒక గ్లాస్ పాలు చిక్కినివి అందించాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం జిల్లాలో మరింత పకడ్బందీగా అమలు కావాలని కలెక్టర్ వైద్యాధికారులను ఆదేశించారు.

వలసలకు మొగ్గుచూపుతున్న కూలీలు

11 వారాలైన పడని వేతనం

ప్రజాశక్తి-తుగ్గలి

జాతీయ ఉపాధి హామీ పథకంలో పని చేసే కూలీలకు వేతనాలు సక్రమంగా అందక పోవడంతో కూలీలు ఆందోళన చెందుతున్నారు. గత 11 వారాలు పనిచేసినప్పటికీ ఇంతవరకు కూలీలకు వేతనాలు అకౌంట్లలోకి జమ కాకపోవడంతో ఉపాధి పనులపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. దానికి తోడు వర్క్ ఐడి కూడా తగ్గించడంతో కూలీలు సుదూర ప్రాంతాల వైపు పోవడానికి మొగ్గు చూపుతున్నారు. 11 వారాలైనా ఉపాధి వేతనాలు ప్రభుత్వం అందించకపోవడంతో కూలీల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. అధికారులు మాత్రం వెంటనే పడతాయంటూ కూలీలకు బుజ్జగిస్తున్నప్పటికీ కూలీలు మాత్రం ఉపాధి పనులపై ఆసక్తి కనపరచడం లేదు. కూలి మీద ఆధారపడ్డ కూలీలు వేతనాలు సకాలంలో రాకపోవడంతో వలసలు శరణ్యమని అంటున్నారు. గత సంవత్సరం చేసిన పనులకే కూలీలకు వేతనాలు రావడం లేదని, ఇప్పుడు పని చేస్తే కూలీలు ఎప్పుడు పడతావో అర్థం కాని పరిస్థితి ఏర్పడిందని కూలీలు వాపోతున్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి పెండింగులో ఉన్న వేతనాలను సకాలంలో చెల్లించి ఆదుకోవాలని మండలంలోని కూలీలు కోరుతున్నారు.

లీకేజితో బస్టాండులో పాట్లు

వాహనాదారులకు తప్పని అవస్థలు

ప్రజాశక్తి సి బెళగల్

సిబెళగల్ లోని చెరువు ఆయకట్టు కుడి కాలువ పొడవునా లీకేజి సమస్య తాండవిస్తోంది. ఆ నీరు వదిలినప్పుడల్లా అధికంగా ప్రవహిస్తూ దిగువన బస్టాండ్ ఆవరణాన్ని ముంచేత్తుతోంది. పెద్ద కాలువ దగ్గర బురాన్ దొడ్డి రోడ్డు మొదలుకొని బస్టాండ్ దిగువకు సుమారు 500 అడుగుల మేర బురదమయంగా మారీ బస్టాండ్ కు వచ్చి వెళ్లే ప్రజలకు, పల్లె ప్రజానీకానికి పాట్లు తప్పడం లేదు. అడుగు పెట్టందే ఏ పనులు జరగడం లేదు. ఇక్కడే బస్సులు దిగాలన్నా, ఎక్కాలన్నా ఇతర వాహనాలు రావాలన్నా, వెళ్లాలన్నా నిలుపాలన్నా అవస్థలుపడుతున్నారు. ఇలాంటివి శాశ్వత పరిస్కారం చేయాల్సిన అధికారులు, నాయకులు ఇదే దారిలోనే చూస్తూ వెళ్తున్నారే తప్ప చేసిందేమి లేదని పలువురు విమర్శలు చేస్తున్నారు. ఏళ్లుగా బిటి రోడ్డు వేయక బస్టాండ్ లోనే పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. అక్కడ ఈ లీకేజి నీరు నిలుస్తుండటంతో కుంటలను

లీకేజీతో రోడ్డుపై పారుగుతున్న నీరు ఇబ్బంది పడుతున్న వాహనాలు

తలపిస్తున్నాయి. ఇప్పటికైనా నిద్రావస్థను వీడి దృష్టి సారించాలని పలువురు వ్యక్తం చేస్తున్నారు.

శనగల లోడ్ ట్రాక్టర్ బోల్తా

ప్రజాశక్తి - ఉయ్యాలవాడ

మండలంలోని పుచ్చకాయలపల్లె గ్రామానికి చెందిన రైతులు సంజామల మండలం నొస్సం గ్రామంలోని గోడౌన్‌కు శనగలు ట్రాక్టర్‌లో తీసుకెళ్తుండగా కోయిలకొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వెనక నుండి ఢీకొనడంతో బోల్తా పడింది. శనగల బస్తాలు పగిలి రోడ్డుమీద ధాన్యం చెల్లాచెదురుగా పడ్డాయి. దీంతో రైతుకు నష్టం వాటిల్లింది. రైతులు కష్టపడి పండించిన పంట నేలపాలు కావడంతో బస్సు డ్రైవర్ నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

గ్రంథాలయాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - పాణ్యం

గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సుభాష్ చంద్రబోస్ అన్నారు. మంగళవారం స్థానిక గ్రంథాలయ అవరణలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు మాట్లాడారు. సెల్‌ఫోన్ వల్ల సమస్యలు పెరుగుతాయని, కానీ పుస్తకాలు విజ్ఞాన భాండాగారం అని ఎంఇఒ కోటయ్య అన్నారు. ఈఓ అనురాధ, వైసిపి నాయకులు కరుణాకర్ రెడ్డి, చంద్ర శేఖర్ రెడ్డిలు మొక్కలు నాటారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిని భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

యాగంటి దేవస్థానాన్ని దర్శించుకున్న ప్రముఖ సినీ గాయకుడు

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రం యాగంటి శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థానాన్ని ప్రముఖ గాయకుడు, సంగీత దర్శకులు, వీర నరసింహారెడ్డి సినిమాలో జై బాలయ్య పాటను రచించిన కరీముల్లా వారి బృందం మంగళవారం దర్శించుకున్నారు. వెంకటేశ్వర గృహ, ఆగస్త్య పుష్కరిణిని సందర్శించారు. టిడిపి ముస్లిం మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు రాయలసీమ సలాం ఆధ్వర్యంలో కరీముల్లా బృందాన్ని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు హర్షద్ పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి

ప్రజాశక్తి - బనగానపల్లె

బాల్య వివాహాల నిర్మూలనకు ఆశా వర్కర్లు కృషి చేయాలని నంద్యాల జిల్లా సామాజిక, ప్రవర్తన మార్పు జిల్లా కో ఆర్డినేటర్ బత్తుల. విజయకుమార్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పలుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో డాక్టర్ మధు మౌనిక ఆధ్వర్యంలో ఆశ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మధు మౌనిక, ఎంపిహెచ్ఈఓ విజయకుమార్, పీహెచ్‌ఎం గంగ నాగేశ్వరి, సిహెచ్ ఓలు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

గెలుపోటములు సమానంగా భావించాలి : బిసి ఇందిరా

ప్రజాశక్తి - బనగానపల్లె

క్రీడాకారులు గెలుపోటములను సమానంగా భావించాలని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి సతీమణి, థాయ్ బాక్సింగ్ రాష్ట్ర చైర్మన్ బీసీ ఇందిరా పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని మార్కెట్ యార్డ్ ఆవరణలో పుల్లారెడ్డి జ్ఞాపకార్థం క్రికెట్ పోటీల విజేతలకు బిసి ఇందిరా నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జయన్న, పవన్ కుమార్ రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి,యువకులు, తదితరులు పాల్గొన్నారు.

బహుమతులు అందజేస్తున్న బిసి ఇందిరా

రోడ్డు కోసం రా(వె)తలు..

నంద్యాల జిల్లా జూపాడుబంగ్లా మండలం తూడిచర్ల గ్రామానికి వున్న రోడ్డు అధ్వానంగా మారడంతో ఆ గ్రామస్తులకు చాలా ఏళ్లుగా వెతలు తప్పడం లేదు. గ్రామానికి రోడ్డు వేయాలని ఎమ్మెల్యేకు పలు సార్లు విన్నవించారు. జిల్లా పరిషత్ ఛైర్మన్‌ను కూడా కోరారు. ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆ గ్రామానికి వెళ్లిన ఎమ్మెల్యే తొగూరు ఆర్థర్‌ను రోడ్డు వేయాలని అడిగారు. అయినా ఎవరూ స్పందించకపోవడంతో చివరి ఊరి మొదట్లో, ఊరిలో పలు ప్రాంతాల్లో "ఎమ్మెల్యే సారు.. మా ఊరికి రోడ్డేయండి", "అయ్యా..రోడ్డు" అంటూ ఇలా ఇంటి గోడలపై రాశారు.

నాణ్యతకు తిలోదకాలు

- నాసిరకంగా క్రీడా కోర్టుల నిర్మాణాలు
- వారం రోజులకే కూలిన బాస్కెట్ బాల్ కోర్టులోని పోల్
- మామూళ్ల మత్తులో తూగుతూ పట్టించుకోని ఇంజనీరింగ్ అధికారులు

బాస్కెట్ బాల్ కోర్టులో కూలిపోయిన పోల్

ప్రజాశక్తి - పగిడ్యాల

విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు, నైపుణ్యం పెంచడానికి ప్రభుత్వం వివిధ క్రీడా కోర్టులను, రన్నింగ్ రన్‌వేలను నిర్మించేందుకు జిల్లాలోని ప్రతి గురుకుల పాఠశాలకు నిధులు మంజూరు చేసింది. సంబంధిత ఇంజనీర్లు నిర్లక్ష్యం, మామూళ్ల మత్తులో తూగుతూ పర్యవేక్షణను గాలికొదిలేశారు. దీంతో కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ నిర్మాణాలు చేపడుతున్నారు. గురుకుల పాఠశాల మైదానంలో క్రీడా కోర్టు నిర్మించిన వారం రోజులు కూడా గడవక ముందే కోర్టులోని పోల్ కూలిపోతూ దర్శనమిస్తున్నాయి. నిందుకు నిదర్శనం మండలంలోని లక్ష్మాపురం అంచ సమీపాన ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలోని క్రీడా బాస్కెట్ బాల్ పోల్.

పగిడ్యాల మండలం లక్ష్మాపురం అంచ సమీపాన ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థినుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు క్రీడా మైదానంలో వివిధ రకాల క్రీడలకు సంబంధించి కోర్టుల నిర్మాణానికి ప్రభుత్వాలు నిధులు మంజూరు చేసింది. స్పోర్ట్స్ అథారిటీ కింద 2018లో పాఠశాలలో వివిధ రకాల క్రీడాల సంబంధించి కోర్టుల నిర్మాణానికి అప్పటి రాష్ట్ర ప్రభుత్వం రూ.50 లక్షలు నిధులు మంజూరు చేసింది. అయితే 2019లో నిర్మాణం ప్రారంభించి 20 శాతం పనులు చేసి నిలుపుదల చేశారు. మళ్లీ 2022లో క్రీడా మైదానంలో బాస్కెట్ బాల్ కోర్టు, 200 మీటర్ల రనింగ్ ట్రాక్, కబడ్డీ కోర్టు, ఖోఖో కోర్టు, వాలీబాల్ కోర్టు నిర్మాణానికి పున: ప్రారంభించారు. సంబంధిత ఇంజనీర్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్ నాణ్యతకు తిలోదకాలు ఇచ్చి నిర్మాణం చేపట్టాడు. దీంతో బాస్కెట్ బాల్ కోర్టు పోల్ నిర్మించిన వారానికే కూలిపోయింది. క్రీడా కోర్టుల నిర్మాణానికి సిమెంట్ తక్కువ మోతాదులో, ఇసుక కాకుండా కంకర డస్టు ఉపయోగించడం వల్ల బాస్కెట్ బాల్ కోర్టు పోల్ కూలి పోయిందని విద్యార్థినిల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. లక్షలు ఖర్చు పెట్టి క్రీడా కోర్టులు నాణ్యత లేకుండా నిర్మిస్తే ఇలాగే కూలిపోతాయని విద్యార్థినుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. నాణ్యత లేకుండా నిర్మించి పోల్ విద్యార్థినిలు ప్రాక్టీసు చేసే సమయంలో కూలి ప్రమాదాలు జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తనిఖీలు చేయాల్సిన సంబంధిత అధికారులు లంచాలు తీసుకుని పర్యవేక్షణ చేయకపోవడం తోనే ఇలా వారానికే పోల్ కూలిపోయిందనే విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తనిఖీలు చేసి నాణ్యత లేని క్రీడా కోర్టులను నిర్మించిన వారిపై, పర్యవేక్షణ మరిచిన సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోని క్రీడా మైదానాలు, క్రీడా కోర్టుల నిర్మాణం నాణ్యతతో చేపట్టేలా చూడాలని విద్యార్థినిల తల్లిదండ్రులు, సీనియర్ క్రీడాకారులు కోరుతున్నారు.

మెడిసిన్ విద్యార్థినికి రూ.1.25 లక్షలు ఆర్థికసాయం

ఆర్థిక సహాయం అందచేస్తున్న రామకృష్ణా రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల

మెడిసిన్ ఫైనల్ ఇయర్ చదువుతున్న కర్నూల్‌కు చెందిన షెహనాజ్ పర్వీన్‌కు కలిగిన కష్టాన్ని రామకృష్ణ విద్యాసంస్థల అధినేత డాక్టర్ రామకృష్ణ రెడ్డి గుర్తించి ధైర్యం చెప్పి రూ. 1.25లక్షలు ఆర్థిక సహాయం మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద కుటుంబంలో పుట్టిన వారు డబ్బు సమస్యతో విద్యకు దూరం కాకూడదని ఎందరో ఉపన్యాసాలు ఇస్తారని, చదువుతున్న చదువుకు తాము ఉన్నామని ఆదుకునే వారు ప్రస్తుత సమాజంలో భూతద్దం వెదికినా కనిపించరని అన్నారు. దేశాభివృద్ధికి ఉపయోగపడే విద్యార్థినికి ఆర్థిక సహాయం అందించడం పూర్వజన్మ సుకృతంగా, అదృష్టంగా భావిస్తూ ఆర్థికసాయం అందచేస్తున్నామని చెప్పారు. చదువు పూర్తి కావడానికి సహాయం చేసిన నందికొట్కూరు ఎమ్మెల్యే ఆర్థర్, లెక్చరర్ రామకృష్ణారెడ్డి, రామకృష్ణా డిగ్రీ,పీజీ కళాశాల అధినేత జి.రామకృష్ణారెడ్డి, ప్రగతి రెడ్డి చేసిన మేలు జీవిత కాలం గుర్తు పెట్టుకుంటానని విద్యార్థిని పేర్కొన్నారు.

ఎంఇఒ బ్రహ్మంపై విచారణకు ఆర్‌జెడి ఆదేశాలు

- విచారణ అధికారిగా రాయచోటి డిప్యూటీ డిఇఒ వరలక్ష్మి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల ఎంఇఒ బ్రహ్మంపై విచారణకు ఆదేశిస్తూ ఆర్‌జెడి ఆదేశాలు జారీ చేశారు. గడివేముల ఇంచార్జ్ ఎంఇఒగా బ్రహ్మం నాయక్ కొనసాగుతున్నారు. ఆయన మహిళా ఉపాధ్యాయుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేస్తూ, వేధిస్తున్నాడని, అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని పలు ఆరోపణలు చేస్తూ బాధితులు గత నెల 18న ఆర్‌జెడి ప్రతాపరెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆర్‌జెడి విచారణకు కడప జిల్లా రాయచోటి ఉప విద్యాశాఖ అధికారిణి వరలక్ష్మిని నియమించారు. సర్క్యులర్ కూడా జిల్లా విద్యాశాఖ అధికారికి పంపినట్లు సమాచారం. ఈ నెల 9న గడివేముల ఎంఆర్‌సిలో విచారణ చేపట్టనున్నారు. విచారణకు ఫిర్యాదు చేసిన నాగసుందరి, విజయరాణి, బిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు కె.సతీష్ కుమార్, ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎంఇఒ బ్రహ్మంను హాజరు కావాలని అధికారి వరలక్ష్మి నోటీసులు జారీ చేసినట్లు సమాచారం.

నీటి కష్టాలు తీర్చండి : మాజీ ఎమ్మెల్యే

నీటి సమస్యపై కమిషనర్‌తో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూమా

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రాబోయే వేసవిలో నంద్యాల ప్రజలకు నీటి సమస్య లేకుండా చూడాలని, అమృత్ పథకం పూర్తి చేసి నీటి కష్టాలు తీర్చాలని నంద్యాల మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి అధికారులను కోరారు. మంగళవారం నంద్యాల మునిసిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డిని ఆయన కలిసి నీటి సమస్యపై చర్చించారు. అనంతరం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా భూమా మాట్లాడుతూ 80 శాతం పూర్తి అయిన అమృత పథకం పూర్తి చేసి ఇంటింటికి మెరుగైన నీటిని సరఫరా చేయాలని కోరారు. ఫిబ్రవరిలో నీటి సమస్య తీరుస్తానని గతంలో కమిషనర్ హామీ ఇచ్చిన మేరకు పనులు పూర్తి చెయ్యాలన్నారు. విద్యుత్, పైప్ లైన్ సమస్యలు సాకుగా చూపి ప్రజలను ఇబ్బంది పెట్టవద్దని కమిషనర్‌ని కోరారు. త్వరలోనే అన్ని సమస్యలు అధిగమించి ప్రజలకు నీటి కష్టాలు లేకుండా చూస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మాబువలి, న్యాయవాది మనోహర్ రెడ్డి, జయ ప్రకాష్, సుబ్బరాయుడు, తిమ్మయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు ముమ్మరం చేయండి : జెసి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జగనన్న లేఔట్లలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ అధికారులు నిర్లక్ష్య ధోరణి వీడి కేటాయించిన లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తే ఖచ్చితమైన ఫలితాలు వస్తాయని జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్లోని వైయస్సార్ సెంటినరీ హాలులో ఇళ్ల నిర్మాణాల పురోగతిపై ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దారులు, హౌసింగ్ అధికారులు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో జాయింట్ కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఉగాది నాటికి రాష్ట్ర వ్యాప్తంగా 5 లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి గృహ ప్రవేశాలు చేయాలని లక్ష్యంగా పెట్టుకుందని, ఈ మేరకు జిల్లాల వారీగా లక్ష్యాలు కేటాయించి పూర్తి చేయాలని నిర్దేశించిందన్నారు. ఇందులో భాగంగానే సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు లక్ష్యాలు కేటాయించి పూర్తి చేయాలని ఆదేశించామన్నారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ అధికారులు, సంబంధిత మండల స్థాయి అధికారులు, స్పెషల్ అధికారులు ఫాలోఅప్ చేయని కారణంగా నిర్మాణాల ప్రగతి కుంటుపడుతోందన్నారు. జగనన్న లేఔట్లలో నీటి వసతి, విద్యుత్, అప్రోచ్ రోడ్లు తదితర మౌలిక సదుపాయాలు కల్పించినప్పటికీ నిర్మాణాల్లో కేటాయించిన లక్ష్యానికి చేరుకోవడం లేదన్నారు. సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు కేటాయించిన లక్ష్యాలపై హౌసింగ్ అధికారులు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం పర్యవేక్షిస్తే పనులు జరుగుతాయన్నారు. పనులు చేయకుండా కారణాలు చెప్పడం సరి కాదన్నారు. జరుగుతున్న పనులలో మెజర్మెంట్ చేసి ప్రతి ఇంజనీరింగ్ అసిస్టెంట్ 20 బిల్లులకు తక్కువ కాకుండా అప్లోడ్ చేయాలని ఆదేశించారు. ప్రతిరోజు ఉదయం సచివాలయం ఇంజనీర్లకు కేటాయించిన లక్ష్యాలపై ఆరా తీస్తూ.... సాయంత్రం అప్పగించిన పని ఎంతవరకు చేశారని అడిగితే ఫలితాలు ఉంటాయన్నారు. లే అవుట్‌లలో లబ్ధిదారులు ఉండే సమయంలో వెళ్లాలే తప్ప కార్యాలయపు పని వేళల్లో వెళితే పనులు ఎక్కడ జరుగుతాయని ప్రశ్నించారు. గృహాలు కట్టుకునేందుకు లబ్ధిదారులను ప్రోత్సహించడంతో పాటు అర్హత గల రుణాలు ఇప్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. గృహాలు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు కావాల్సిన మెటీరియల్ సరఫరా చేయకుండా ఇబ్బందుల పాలు చేస్తే లబ్ధిదారులు ఆసక్తి చూపరని అన్నారు. కోవెలకుంట్ల, శిరివెళ్ల, చాగలమర్రి తదితర మండలాల్లో నిర్మాణాల ప్రగతి అధ్వానరీతిలో వుందని, లక్ష్యాలు సాధించని సిబ్బందికి గత సమావేశంలో షో కాజ్ నోటీసులు ఇచ్చినప్పటికీ వారిలో 6 మంది ఇప్పటికీ ప్రగతి కనపరచలేదన్నారు. సంబంధిత సిబ్బందికి మరోమారు నోటీసులు జారీ చేసి ప్రగతి కనబరచకపోతే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని హౌసింగ్ పీడీని ఆదేశించారు. సమావేశంలో హౌసింగ్ పిడి రామశేషు, జిల్లా పరిషత్ డిప్యూటీ సిఇఒ సుబ్బారెడ్డి, డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీధర్ రెడ్డి, నియోజకవర్గ స్పెషల్ అధికారులు, ఎంపిడిఒలు, తహశీల్దార్లు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి

అక్కంపల్లిలో చెరువు పనులను తనిఖీ చేస్తున్న ప్రాజెక్టు డైరెక్టర్ రామచంద్రారెడ్డి

చెరువు పనులను ప్రాజెక్ట్ డైరెక్టర్ తనిఖీ

ప్రజాశక్తి - సంజామల

మండలంలోని అక్కంపల్లి గ్రామంలో అమృత్ సరోవర్ కింద కొత్త చెరువులో చేపట్టిన పూడికతీత పనులను నంద్యాల ప్రాజెక్టు డైరెక్టర్ రామచంద్రారెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. అలాగే నొస్సం గ్రామంలో రెవెన్యూ ప్లాంటేషన్ తనిఖీ చేశారు. ఉపాధి కూలీ కూలీలు ఎక్కువమంది పనులకు హాజరయ్యేలా చూడాలని ఆదేశించారు. ఏపీడి సాంబశివరావు, సర్పంచి కృష్ణారెడ్డి, గ్రామ పెద్ద నాగిరెడ్డి, ఏపీవో ప్రకాష్ రావు తదితరులు పాల్గొన్నారు.

అత్యాధునిక సాంకేతికతతో క్యాన్సర్‌కు చికిత్స

ప్రజాశక్తి - పాణ్యం

క్యాన్సర్ చికిత్స కోసం అత్యాధునిక సాంకేతికత, సిఆర్ఐఎస్‌పిఆర్‌తో జన్యు సవరణ చేయడం వల్ల బాధిత రోగులు చాలా వేగంగా సంపూర్ణంగా కోలుకునే అవకాశం ఉందని బెంగుళూరుకు చెందిన కార్కినోస్ హెల్త్ కేర్ రీసెర్చ్ సెంటర్ ప్రాజెక్ట్ అనలిస్ట్ టి.సాయి యశోద క్రిష్ణ తెలిపారు. టెక్నాలజీ డ్రివెన్ ఇన్ కేన్సర్ కేర్‌లో కృత్రిమ మేధస్సు అనే అంశంపై శాంతి రాం ఫార్మసీ కళాశాలలో నిర్వహించిన వర్క్ షాప్ లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు.

ఉచిత వైద్య శిబిరాలకు మెడిసిన్ విరాళం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉచిత వైద్య శిబిరాలకు నంద్యాలకి చెందిన కాత్యాయని మెడికల్ స్టోర్ నిర్వాహకులు వినోద్ రూ. 30 వేలు విలువగల మెడిసిన్ విరాళంగా మంగళవారం అందజేశారు. కాత్యాయని మెడికల్ స్టోర్ నిర్వాకుడు వినోద్‌ను రెడ్ క్రాస్ నిర్వాహకులు అభినందించారు. రెడ్ క్రాస్ వైద్య శిబిరాలకు సహకరించదలచిన వారు 8977750583 నంబరు సంప్రదించాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ దస్తగిరి పర్ల, వైస్ చైర్మన్ మారుతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ సొసైటీ నిర్వాహకులకు ఉచిత మెడిసిన్

జెఇఇ మెయిన్స్‌లో 'ఎస్‌డిఆర్ ఆకాంక్ష' విజయభేరి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జెఈఈ మెయిన్స్ పరీక్ష ఫలితాలలో ఎస్‌డిఆర్ ఆకాంక్ష జూనియర్ కాలేజీ విద్యార్థులు ఆలిండియా ర్యాంకులతో విజయ దుందుభి మోగించారు. మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభకు ముఖ్య అతిథిగా పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి హాజరై మాట్లాడారు. దేశంలోనే రెండవ కఠినమైన జెఈఈ మెయిన్స్‌లో డి. యశ్విత రెడ్డి 99.74 శాతంతో మొదటి స్థానం, జి. లక్ష్మిప్రియ 97.16 శాతంతో రెండవ స్థానం, డి వసంత్- 96.12 శాతంతో మూడవ స్థానంతో పాటుగా మొత్తం 10 మంది విద్యార్థులు 90 శాతం కంటే ఎక్కువ, 92 శాతం విద్యార్థులు జెఈఈ అడ్వాన్స్‌కు అర్హత సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాబోయే కాలంలో మరిన్ని ర్యాంకులు సాధించి కళాశాలకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్‌విఆర్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ శనివారపు వెంకట రామిరెడ్డి, నంద్యాల జడ్పీటీసీ గోకుల్ కృష్ణా రెడ్డి, పాణ్యం మాజీ జడ్పీటీసీ సద్దల సూర్య నారాయణ రెడ్డి, ఆకాంక్ష కళాశాల చైర్మన్ శనివారపు కొండారెడ్డి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, కళాశాల చైర్మన్ ఎస్.కొండారెడ్డి, ఎస్‌విఆర్ కళాశాల చైర్మన్ వెంకట్రాంరెడ్డి తదితరులు

ఉపాధి నిర్వీర్యానికి కేంద్రం కుట్ర

- బడ్జెట్‌లో నిధులు కేటాయింపుపై పునరాలోచన చేయాలి
- వ్యకాసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్

ప్రజాశక్తి - నంద్యాల

ఉపాధి హామీని నిర్వీర్యం చేయడానికి కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతుందని, బడ్జెట్లో నిధుల తగ్గింపు చర్యలు బట్టి అర్థమవుతుందని, రివైజ్డ్ బడ్జెట్‌లోనైనా పునరాలోచన చేసి నిధులు పెంచాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఎపి వ్యకాసం రాష్ట్ర పిలుపులో భాగంగా నంద్యాల జిల్లా టెలీకమ్యూనికేషన్ సర్వీసెస్ సబ్ డివిజనల్ ఇంజనీర్ ఆఫీస్ ముందు నంద్యాల జిల్లా సమితి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమానికి వ్యకాసం జిల్లా అధ్యక్షులు సుబ్బరాయుడు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆవుల శేఖర్ మాట్లాడారు. దేశవ్యాప్తంగా 30 కోట్లకు పైగా జాబు కార్డులు కలిగిన పేదలందరికీ సక్రమంగా పని కల్పించాలంటే కేంద్ర బడ్జెట్లో రెండు లక్షల 40 వేల కోట్ల రూపాయలు అవసరమవుతాయని చెప్పారు. 200 రోజులు పని దినాలు కల్పించి, రోజు కూలీ 600 వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. వేసవి అలవెన్స్‌ను పునరుద్ధరణ చేయాలని, పని ప్రదేశం లో మెడికల్ కిట్లు, ఎండ వేడిమిని తట్టుకొనేవిదంగా టెంట్లు ఏర్పాటు చేయాలని, మజ్జిగ పాకెట్లు, తాగు నీరు పని ప్రదేశాల్లో ఉండేలా చూడాలన్నారు. ఉపాధి కూలీలకు పనిముట్లు ఇవ్వాలని, రైతులు పొలాల్లో ఉపయోగపడే పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్ మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో ఉపాధి కూలీలకు సక్రమంగా పనులు కల్పించడంలో జిల్లా యంత్రాంగం విఫలం చెందిందన్నారు. అనంతరం టెలికామ్ సబ్ డివిజనల్ ఇంజినీర్ వేణుగోపాల్ రావు మాట్లాడుతూ సమస్యను ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో వ్యకాసం నాయకురాలు లక్ష్మి దేవి, సిపిఐ గోస్పాడు మండల కార్యదర్శి హరి, రైతు సంఘం జిల్లా కన్వీనర్ సోమన్న, ప్రజా సంఘాల నాయకులు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి ఆవుల శేఖర్

9న జిల్లా పోస్టాఫీస్ కేంద్రాల వద్ద మహా ధర్నా

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 9న జిల్లా పోస్ట్ ఆఫీస్ కేంద్రాల వద్ద నిర్వహించే మహా ధర్నాను జయప్రదం చేయాలని ఎపి కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్. మార్క్, జిల్లా కార్యవర్గ సభ్యులు రవికుమార్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత నెల 31న పార్లమెంటు సమావేశంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్‌కు నిరసనగా చేపట్టే మహాధర్నాలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

సాసర్ ఫీట్లలో నీరు నింపుతున్న ఫారెస్ట్ అధికారులు

అటవీ వన్యప్రాణుల కోసం నీటి వనరులు ఏర్పాటు

ప్రజాశక్తి - రుద్రవరం

వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో అటవీ వన్యప్రాణులకు నీటి వసతి వనరులు ఏర్పాటు చేసినట్లు పెద్ద కంబలూరు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసులు తెలిపారు. చలమ రేంజి అధికారి ఈశ్వరయ్య ఆదేశాల మేరకు పెద్ద కంబలూరు ఫారెస్ట్ సెక్షన్‌లోని పలు ప్రాంతాలలో ఉన్న సాసర్ ఫీట్‌లలో మంగళవారం నీరు నింపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో అడవుల్లో ఉన్న వన్యప్రాణుల దాహం తీర్చేందుకు సాసర్ ఫీట్లు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈ సాసర్ ఫీట్‌లలో 15 రోజులకు ఒకసారి నీరు నింపి, నిల్వ ఉండేలా చూస్తామన్నారు. ఈ కుంటలలో 4 వేల లీటర్లు ట్రాక్టర్లతో నీళ్లు తెచ్చి పోస్తామన్నారు. కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ నాగప్ప సిబ్బంది ఉన్నారు.

జిమ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న సిఐ సుబ్బారాయుడు

వ్యాయామంతో ఆరోగ్యవంతమైన జీవితం

ప్రజాశక్తి - బనగానపల్లె

శారీరక వ్యాయామంతో ఆరోగ్యవంతమైన జీవన సాగించవచ్చని సిఐ సుబ్బారాయుడు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని కరెంట్ ఆఫీస్ సమీపంలో 6 ఎన్ ఫిట్నెస్ స్టూడియో వ్యాయామ కేంద్రాన్ని యజమాని అరుణ్ జిమ్ సెంటర్‌ను సిఐ సుబ్బారాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో ప్రతి మనిషికి వ్యాయామం ఎంతో అవసరమన్నారు. ఆరోగ్యాన్ని మించిన సంపద మరొకటి లేదని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్నారు. వ్యాయామం వలన అధిక రక్తపోటు, స్థూలకాయం, గుండె జబ్బులు, మధుమేహం, నిద్రలేమి, మానసిక రోగాల వంటి దీర్ఘకాలిక వ్యాధులు రాకుండా నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో నాగేంద్ర, అశోక్, మధు, మహేష్, శివ, రఘు, ఆసిఫ్, జనార్ధన్, ప్రవీణ్, గడ్డం అమీర్ భాష, గడ్డం భాష తదితరులు పాల్గొన్నారు.

సర్వాయిపల్లికి చేరిన పారువేట పల్లకి

ప్రజాశక్తి - ఉయ్యాలవాడ

మండలంలోని సర్వాయి పల్లె గ్రామానికి మంగళవారం అహోబిలం లక్ష్మీనరసింహస్వామి పార్వేట పల్లకి చేరుకుంది. ఊరి చివరన ఉన్న సుబ్బిశెట్టి కోనేరు వద్ద స్వామివారికి ప్రత్యేకంగా పవిత్ర స్నానమాచరించి డిప్యూటీ తాసిల్దారు వెంకటస్వామి, ఎస్ఐ సత్యనారాయణ, విఆర్వోలు, గ్రామ సర్పంచ్ సరాబు ఉమా కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు ప్రత్యేక పూజలు నిర్వహించి మేళ తాళాలతో గ్రామంలోనికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది.

లక్ష్మీ నరసింహ స్వామికి పూజలు చేస్తున్న డిప్యూటీ తహశీల్దార్

హెడ్ కానిస్టేబుల్ సోమ్లా నాయక్ అదృశ్యం

- కుటుంబ సభ్యులు ఫిర్యాదు

సోమ్లా నాయక్ (ఫైల్)

ప్రజాశక్తి - బేతంచెర్ల

బేతంచర్ల పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సోమ్లా నాయక్ మూడు రోజులుగా కనపడడం లేదని కుటుంబ సభ్యుల ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేయడం జరిగింది. ఇదిలా ఉండగా దేవనకొండకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ఓ మహిళకు దాదాపు కోటి రూపాయలకు పైగా పెద్ద మొత్తాన్ని ఇచ్చి మోసపోవడంతో దిక్కుతోచని పరిస్థితులలో ఇంటి నుంచి వెళ్ళిపోతున్నట్లు సోమ్లా నాయక్ ఒక లెటర్ రాసి ఇంట్లో పెట్టి వెళ్లిపోయినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. పోలీసు వారు హెడ్ కానిస్టేబుల్ సోమ్లా నాయక్ మిస్సింగ్ కేసుపై చర్యలు చేపట్టారు.

ఎమ్మెల్యే ఆర్థర్‌కు వినతి పత్రం ఇస్తున్న విధ్యార్థి సంఘాల నాయకులు

శ్రీవాణి స్కూల్ గుర్తింపు రద్దు చేయాలి

- వామపక్ష విద్యార్థి సంఘాల జేఏసీ

ప్రజాశక్తి - నందికొట్కూరు

నందికొట్కూరులోని శ్రీవాణి స్కూలు గుర్తింపు రద్దు చేయాలని వామపక్ష విద్యార్థి నాయకులు ఆది, మహానంది, నాగార్జున, డక్క కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం వారు నందికొట్కూరు ఎమ్మెల్యే తోగురు ఆర్థర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మౌలిక వసతులు లేని శ్రీవాణి స్కూలు గుర్తింపును రద్దు చేయాలని పలుమార్లు ఎంఈఓకు వినతి పత్రం అందించిన పట్టించుకోవడం లేదన్నారు. పాఠశాలలో కనీసం విద్యార్థులకు తాగునీరు, బాత్రూమ్స్ లేకుండా స్కూలు నిర్వహిస్తున్నారని, స్కూలుకు గ్రౌండ్ లేదు అన్నారు. ఉపాధ్యాయులకు బీఈడీ, టీటీసీ,విద్యార్హతలు లేకుండా కేవలం ఇంటర్ డిగ్రీ అయిపోయిన విద్యార్థులతో చదువు చెప్పిస్తున్నారని పేర్కొన్నారు. ఇన్ని సమస్యలు ఉన్నా స్కూల్‌ను పర్యవేక్షించకుండా మెమో కూడా జారీ చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్న ఎంఈఓను సస్పెండ్ చేయాలని ఎమ్మెల్యే వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పిడి ఎస్‌యు డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు సాయిప్రకాష్, మద్రిస్వామి, బిట్టు కుమార్, ఏఐఎస్ఎఫ్ డివిజన్ అధ్యక్షుడు వీరేంద్ర, వినోద్ ఎస్ఎఫ్ఐ డివిజన్ నాయకులు హరివర్ధన్, శ్రీకాంత్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

సచివాలయ మండల కన్వీనర్‌గా బోరా మల్లికార్జున రెడ్డి

ప్రజాశక్తి - ప్యాపిలి

సచివాలయ వైసిపి మండల కన్వీనర్ బోరా మల్లికార్జున రెడ్డి నియామకం అయ్యారు. ఈ సందర్భంగా మల్లికార్జున రెడ్డికి వైసీపీ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. బోరా మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ ప్రతి రోజు కొన్ని సచివాలయాలను సందర్శించి లోటు పాట్లను సవరిస్తానన్నారు. ఉద్యోగులు ప్రధానంగా విధులు సక్రమంగా నిర్వహించి ప్రజలకు తోడ్పాటు అందిచాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కటినచర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమయపాలన కచ్చితంగా పాటించాలన్నారు.

విచారణ జరుపుతున్న ఎంఇఒ

హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసు

ప్రజాశక్తి - పాములపాడు

మండలంలోని ఎర్ర గూడూరు గ్రామంలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో చెట్లు నరికిన కథనాలు పత్రికల్లో వచ్చిన వాటిపై ఎంఈఓ బాలాజీ నాయక్ చర్యలు చేపట్టారు. పాఠశాల ప్రధానోపా ధ్యాయురాలు పేరేంటి కమిటీ చైర్మన్‌లతో విచారించి చెట్లు నరికినేది వాస్తవమేనని ఐదు చెట్లు నరికినట్లు ఎంఈఓ తెలిపారు. హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసు ఇచ్చినట్లు తెలిపారు. విచారణ నివేదికను డీఈవోకు పంపనట్లు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకోబడతాయని తెలిపారు.

ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం,ఉపాధ్యాయులు

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు మహబూబ్ బాష, వెంకటవసంత్‌లు అండర్ - 17, అండర్ - 14 జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ బేస్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు కోటయ్య మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులు గత నెల 28 నుంచి 30 వరకు కాకినాడలో జరిగిన స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి పోటీల్లో అండర్ - 17, అండర్ -14 విభాగా ల్లో బేస్‌బాల్ పోటీలకు ఉమ్మడి జిల్లాల తరుపున పాల్గొని మన జిల్లా జట్టు రాష్ట్రంలో నాల్గవ స్థానంలో నిలిచేందుకు కృషి చేసారని తెలిపారు. త్వరలో జరగబోయే జాతీయ స్థాయి పోటీల్లో ఆంధ్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తా రని ఆయన వివరించారు. జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులను, పిడి దాదాపీర్, పిఈటి భారతిలను ప్రధానోపాధ్యాయులు కొటయ్య, విద్యా కమిటీ చైర్మన్ అబ్దుల్లా, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది అభినందించారు.

నేడు బైక్‌ల వేలం

ప్రజాశక్తి - పాములపాడు

పాములపాడు పోలీసు స్టేషన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న 7 మోటార్ సైకిల్స్‌ను బుధవారం వేలం వేయనున్నట్లు ఎస్సై అశోక్ మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ చాలా కాలం నుండి పెండింగ్‌లో ఉన్న వాహనాలను యజమానుదారులు ఎవరూ వాటి గురించి ముందుకు రానందున వాటిని పాములపాడు పోలీసు స్టేషన్ ప్రాంగణములో తహసిల్దారు, సిఐల సమక్షములో వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు ఉదయం 9.00 గంటలకు రూ.1000 టోకెన్ ఫీ కట్టి వేలములో పాల్గొనవచ్చునని తెలిపారు.

కులమత, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జడ్పి చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

సంక్షేమ పథకాల బుక్లెట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జడ్పి చైర్మన్ పాపిరెడ్డి

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే ఆర్థర్

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

అర్హులైన పేదలందరికీ కుల మతాలకు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కనకాద్రిపల్లె గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డిలు పాల్గొన్నారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ అంబటి గురువి రెడ్డి, కెబి దస్తగిరిలు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరిస్తూ రూపొందించిన ప్రత్యేక బుక్‌లెట్లను ప్రతి ఇంటికీ అందజేశారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షులు మీర్జాపురం సర్పంచ్ లాయర్ మహేశ్వర్ రెడ్డి, సచివాలయాల కన్వీనర్ మొలక రాజారెడ్డి, పేరం సూర్యనారాయణ రెడ్డి, తోట మల్లేశ్వర్ రెడ్డి, యాపర్ల వెంకటేశ్వర రెడ్డి, సర్పంచ్ కంబగిరి స్వామి, శేఖర్ రెడ్డి, చింతలాయ పల్లె నీలం సంజీవ కుమార్ రెడ్డి, కోటపాడు ఈశ్వర్ రెడ్డి, ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షులు పులి ప్రకాశ్ రెడ్డి, నందిపాడు సర్పంచి గురివిరెడ్డి, కలవటాల తిమ్మారెడ్డి, ఉలవల నరసింహుడు, అధికారులు తదితరులు పాల్గొన్నారు. **నందికొట్కూరు :** పేదల సంక్షేమ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. మంగళవారం నందికొట్కూరు పట్టణంలోని సచివాలయం 4, నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆర్థర్ పాల్గొన్నారు. గడప గడపకు ఎమ్మెల్యే వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ, ప్రజా సమస్యలుపై ఆరా తీశారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళగా సీఎం జగన్ పాలన అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మొల్ల రబ్బాని, కౌన్సిలర్ జాకీర్ హుస్సేన్, మున్సిపల్ కమిషనర్ పి కిషోర్, వైసీపీ నాయకులు సుధాకర్ రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ పద్మావతి, మండల వ్యవసాయ అధికారి శ్రావణి, విద్యాధికారి ఫైజున్నిసా బేగం, ఆర్డబ్ల్యూ ఏఈ వేణు మాధురి, విద్యుత్ శాఖ ఏఈ రాములు నాయక్, సింగిల్ విండో చైర్మన్ సగినేల ఉసేనయ్య, ఉర్దు అకాడమీ రాష్ట్ర డైరెక్టర్ అబ్దుల్ షఉకురు, వైసీపీ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు. **బేతంచెర్ల :** ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందజేయడమే సిఎం జగన్ లక్ష్యమని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ సిహెచ్ చలం రెడ్డి అన్నారు. బేతంచర్ల నగర పంచాయతీలోని మూడవ వార్డులో కౌన్సిలర్ చింతల నాగిరెడ్డి ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమము నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు.వైసిపి సీనియర్ నాయకులు బాబుల్ రెడ్డి, గొరుమాను కొండ సర్పంచ్ కోడె వెంకటేశ్వర్లు, సింగిల్ విండో అధ్యక్షుడు రుద్రవరం నారాయణ వాల్మీకి ఫెడరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మురళి కృష్ణ గూని నాగరాజు, ఎద్దులన్న, తిరుమలేశ్వర్ రెడ్డి, చంద్రశేఖర్, కమల్ బాష, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఇఒ లవన్న

11 నుండి మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి - శ్రీశైలం

మహాశివరాత్రి సందర్భంగా శ్రీశైలం క్షేత్రంలో ఈ నెల 11వ తేదీ నుండి 21వ తేదీ వరకు వైభవంగా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయని దేవస్థానం కార్య నిర్వహణ అధికారి లవన్న తెలిపారు. మంగళవారం ఇఒ మాట్లాడుతూ 11న ఉదయం 8:48 గంటలకు ముందుగా వేగశాల ప్రవేశంతో ఉత్సవాలు ప్రారంభమై.. 21వ తేదీ పుష్పోత్సవం చెయ్యనోత్సవంతో బ్రహోత్సవాలు ముగియనున్నాయన్నారు. ఈ ఉత్సవాలలో స్వామి, అమ్మవార్లకు ప్రతిరోజు వాహన సేవలు, అలంకారాలు, గ్రామోత్సవం కార్యక్రమాలు నిర్వహించబడతాయన్నారు. ఈ బ్రహ్మోత్సవాలలో ప్రభుత్వం తరపు నుండి, పలు రకాల దేవస్థానం నుండి పట్టు వస్త్రాలను సమర్పించనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా 11వ తేదీన శ్రీకాళహస్తీశ్వర దేవస్థానం నుండి, 13వ తేదీన దుర్గా మల్లేశ్వర దేవస్థానం, 14వ తేదీన ఉదయం వరసిద్ధి వినాయక కాణిపాకం దేవస్థానం నుండి, సాయంకాలం తిరుమల తిరుపతి దేవస్థానం నుండి, 15వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం తరపునుండి పట్టు వస్త్రాలు సమర్పించనున్నట్లు తెలిపారు.

భక్తుల కోసం ఏర్పాట్లు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో స్వామి అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల కోసం పలు రకాల ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని దేవస్థానం కార్యనిర్వహణాధికారి తెలిపారు. శివ దీక్ష శిబిరాలను, భక్తులు సేదతీరిందుకు చలువ పందిళ్ళను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. దర్శనానికి నాలుగో రకాల క్యూ లైన్లను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. జ్యోతిర్ముడిని సమర్పించుకునేం దుకు పాతాళంగా మార్గంలోని శివదీక్ష శిబిరాలలో తగిన ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు.

16 నుండి మహానందిలో.. బ్రహ్మోత్సవాలు

మహానంది : మహానంది పుణ్య క్షేత్రంలో ఈ నెల 16వ తేదీ నుండి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో రెండవ కోఆర్డినేషన్ సమావేశం మంగళవారం క్షేత్రంలోని పోచా బ్రహ్మానంద రెడ్డి విశ్రాంతిభవనంలో ఆర్డీవో ఏ.శ్రీనివాస్ అధ్యక్షతన అన్ని శాఖల అధికారులతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలను అధికారుల సమన్వయంతో విజయవంతం చేద్దామన్నారు. ఆలయ ఈఓ చంద్ర శేఖర్ రెడ్డి మాట్లాడుతూ భక్తుల కోసం ప్రత్యేక దర్శన క్యూలైన్‌లు, తాగునీరు, మజ్జిగ వితరణ, అన్నదాన వితరణ, లడ్డు ప్రసాదంలు, జాగరణ సమయంలో ప్రత్యేక సాంస్కతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. డిఎస్పీ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక పోలీసు యంత్రాంగం, సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వైద్యాధికారి చంద్ర శేఖర్ మాట్లాడుతూ ప్రత్యేక మెడికల్ క్యాంప్ లు ఏర్పాటు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేసే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆర్టీసీ డిఎం మాట్లాడుతూ గంగాధర రావు మాట్లాడుతూ నంద్యాల, బుక్కాపురం రోడ్లలో ప్రతి ఐదు నిమిషాలకు ఒక బస్సు చొప్పున 20 బస్సులు, గాజులపల్లి, మహానంది మార్గంలో ఐదు బస్సులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాలకమండలి చైర్మన్ మహేశ్వర్ రెడ్డి, మహానంది తాసిల్దార్ శెట్టి, ఎంపీడీవో శివ నాగజ్యోతి, విద్యుత్ శాఖ ఏఈ ప్రభాకర్ రెడ్డి, అన్ని శాఖల అధికారులు, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యానవన పంటల సాగుతో అధిక ఆదాయం

ప్రజాశక్తి - కొత్తపల్లి

ఉద్యానవన పంటల సాగుతో రైతులు అధిక ఆదాయం పొందవచ్చునని హార్టికల్చర్ సూపర్వైజర్ రవి తెలిపారు. మంగళవారం మండలంలోని ముసలమడుగు గ్రామంలో మునగ రైతులు పంటలు ఉపాధి కూలీల పనులను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఉన్న మునగ సాగు పంటకు రైతులు ముందుకు రావడం హర్షించదగ్గ విషయమన్నారు. ఉద్యానవన పంటల సాగుతో రైతుల అభివృద్ధికి సాధ్యం అన్నారు. మునగ పంటలు సాగు చేస్తున్న రైతులకు ఉపాధి హామీ పథకం కింద రెండు సంవత్సరాలకు లక్ష రూపాయలు ఇవ్వడం జరుగుతుందన్నారు. మునగ సాగుకు పెట్టుబడి తక్కువ ఆదాయం ఎక్కువ పొందవచ్చని రైతులకు సూచించారు. ముసలమడుగు గ్రామంలో సుమారు 80 మంది రైతులకు గాను 100 ఎకరాల్లో పంట సాగు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. రైతులు ఆర్థిక అభివృద్ధి చెందాలంటే ఉద్యానవనం పంటలు సాగు ముఖ్యమన్నారు.

రానున్న రోజుల్లో కూడా ఉద్యానవన పంటలకు రైతులు ముందుకు వచ్చి ఉద్యానవనం పంటలు సాగు చేసుకోవాలన్నారు. అనంతరం ఉపాధి కూలీలతో మునగ పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ దేవదాస్, మునగ రైతులు, ఉపాధి కూలీలు ఉన్నారు.

చిరుధాన్యాల సాగుపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి - జూపాడుబంగ్లా

రైతులు రాబోయే ఖరీఫ్ సీజన్లో చిరు ధాన్యాలు సాగు చేసేందుకు కృషి చేయాలని ఏపీఎం అంబమ్మ సూచించారు. మంగళవారం రైతు ఉత్పత్తిదారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాణిజ్య పంటలతో పాటు నిత్యావసరంగా ఉపయోగపడే చిరుధాన్యాలను సాగు చేయాలని కోరారు. భవిష్యత్తులో చిరు ధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు అయ్యే అవకాశం ఉందని, రైతులు చిరు ధాన్యాల పంట సాగుపై అవగాహన పెంచుకొని వాటిని సాగు చేయాలని సూచించారు. హరిత విప్లవం నేపథ్యంలో ఆహార భద్రత సాధించినప్పటికీ ప్రస్తుతం పోషకాహార భద్రత మన ముందున్న పెద్ద సవాల్ అన్నారు. ఇది అధిగమించాలంటే రైతులు చిరుధాన్యాల పంటల సాగు, విస్తీర్ణం పెంచడమే గాక.. వాటి వినియోగం సైతం పెద్ద ఎత్తున పెంచడం ఒక్కటే మార్గమన్నారు. చిరుధాన్యాలు పండించే రైతులకు ప్రోత్సాహక మద్దతు ధరలు కూడా లభిస్తాయని చెప్పారు. అనంతరం రూ.6 లక్షల బ్యాంకు రుణాలను పంపిణీ చేశారు. సమావేశంలో జిల్లా ఎఫ్‌పీవో బాబూరావు, కర్రెన్న, నాగన్న, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

: మాజీ ఎమ్మెల్యే బుడ్డా

ఇదేం కర్మ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

ప్రజాశక్తి - ఆత్మకూరు

స్థానిక సమస్యలను కూడా పరిష్కరించడంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్నారు. మంగళవారం రాష్ట్రానికి ఇదేం కర్మ కార్యక్రమంలో భాగంగా ఆత్మకూరు పట్టణంలోని అర్బన్ కాలనీలో ఆయన టిడిపి కార్యకర్తలతో కలిసి ఇంటింటికి వెళ్లి ఆ ఇంటికి అమలు అవుతున్న పథకా లు ప్రభుత్వం పెంచిన ధరలు ప్రజలు భరిస్తున్న ఆర్థిక ఇబ్బందులు ఇతర అంశాలపై ఆయన వివరించారు. అర్బన్ కాలనీలో ప్రభుత్వం వేసిన విద్యుత్ స్తంభానికి వైర్లు బిగించకపోతే స్థానికులే తమ ఇంటి నుండి విద్యుత్ కనెక్షన్ ఇచ్చి వీధిలో తిరిగే ప్రజలకు వెలుగు ఇస్తున్నారని ఆయన అన్నారు. సరైన రోడ్డు లేకపోవడం దానికి సౌకర్యం లేకపోవడం లాంటి మౌలిక వసతులు కూడా కల్పించలేకపో యారని అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు నాగేశ్వరరావు, రమేష్ గౌడ్, సాకలి రమణ, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు. **బండి ఆత్మకూర్ :** రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారని టిడిపి మండల అధ్యక్షుడు నందిపాటి నరసింహారెడ్డి, శ్రీశైలం నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షుడు మల్లేశ్వర్ రెడ్డి తెలిపారు. మంగళవారం రామాపురం గ్రామంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధిక ధరలతో సామాన్య ప్రజలపై పెనుమారం మోపిన వైసిపి సర్కారుపై ప్రజలు ఆగ్రహంగా ఉన్నారని, రాబోయే ఎన్నికల్లో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. నాయకులు సుబ్బలక్ష్మయ్య, సీనియర్ నాయకులు బైరెడ్డి సుబ్బారెడ్డి, నందిపాటి నరసింహారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి సిద్దయ్య, నాగేశ్వర్ రెడ్డి, జాకీర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో ప్రభుత్వ పథకాలు ఇంటింటికీ తీసుకెళ్దాం

- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి, నాయకులు

గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లు సమన్వయంతో ప్రభుత్వ పథకాలను ప్రతి ఇంటికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. మంగళవారం జెసిఎస్ మండల కన్వీనర్ మొలక రాజారెడ్డి అధ్యక్షతన కొలిమిగుండ్ల మండల పరిధిలోని గృహ సారథులు, 548 సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లలకు సాయి సదన్ ఫంక్షన్ హాల్‌లో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మెన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, మండల కన్వీనర్ అంబటి గురువిరెడ్డి, పేరం సత్యనారాయణరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి తేడా ఏంటో ప్రజలకు వివరించాలని సూచించారు. జిల్లా పరిషత్ చైర్మన్ మాట్లాడుతూ బనగానపల్లె నియోజకవర్గం తాగునీటి సమస్య పరిష్కారం కోసం రూ. 100 కోట్లు ఎమ్మెల్యే మంజూరు చేస్తే అందులో దాదాపు 30 కోట్లు కొలిమిగుండ్ల మండలానికి కేటాయించారన్నారు. కార్యక్రమంలో జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు మహేశ్వర్ రెడ్డి, ఎంపీటీసీ జిల్లా సంఘం అధ్యక్షులు పులి ప్రకాష్ రెడ్డి, సర్పంచులు గురువిరెడ్డి, లక్ష్మీ నారాయణ యాదవ్, కంబగిరిస్వామి, కొండయ్య, రామాంజనేయులు, యాపర్ల వెంకటేశ్వర్‌రెడ్డి, తోట మల్లేశ్వర్ రెడ్డి, కలవటాల తిమ్మారెడ్డి, జగన్, ఎంపిటిసిలు, మండల ఉపాధ్యక్షులు ఎస్‌వి కృష్ణారెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు. **బండి ఆత్మకూర్ :** రాష్ట్రంలో వైసిపి సంక్షేమ పథకాల ముందు టిడిపి ఎన్ని పాదయాత్రలు చేసినా ప్రజలు నమ్మరని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి అన్నారు. బండి ఆత్మకూరు మార్కెట్ యార్డులో సచివాలయ కన్వీనర్లు, గృహ రథసారథులు, వాలంటీర్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీసిడిపిఎల్ డైరెక్టర్ శశికళ రెడ్డి, శ్రీశైలం నియోజకవర్గం సమన్వయకర్త శిల్ప భువనేశ్వర్ రెడ్డి, ఎంపిపి డి.చిన్న సంజీవరెడ్డి, మాజీ ఎంపిపి దేశ్ వెంకట్రాంరెడ్డి, మండల వైస్ చైర్మన్ ముంతల మధురాని, పరమటూరు సహకార సంఘం చైర్మన్ పురం శివలింగం, ఎంపీటీసీ మానుపాటి పుల్లయ్య, వైసిపి కన్వీనర్ బారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్ సంధ్య, వాలంటీర్లు, కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు. **పాణ్యం :** రాబోయే ఎన్నికలలో వైసిపిని తిరిగి అధికారంలోకి తీసుకురావడానికి వాలంటీర్లు, గృహ సారథులు కృషి చేయాలని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి కోరారు. స్థానిక కృష్ణ దేవాలయంలో జరిగిన నీవెంటే జగనన్న కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్లవి, ఎంపిపి హుస్సేన్ బీ, నాయకులు సూర్యనారాయణ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, చందమామ బాబు, పాలం చంద్ర శేఖర్ రెడ్డి, మేకల సుబ్బారాయుడు, తమ్మరాజు పల్లె శేషు, ఎంపిటిసిలు పాల్గొన్నారు. **గడివేముల :** గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వాలంటరీల సమన్వయంతో ప్రభుత్వం అందించే పథకాలను ప్రజలబ్ధిదారులకు చేరవేయాలని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా గడివేముల మండలంలోని గృహ సారథులకు గడివేములలోని శ్రీ రాజరాజేశ్వరి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. మండల ఇంచార్జ్ కొరట మద్ది నాగేశ్వర రెడ్డి, నంద్యాల జడ్పిటిసి గోపవరం గోకుల్ కృష్ణారెడ్డి, గడివేముల జడ్పిటిసి ఆర్.బి.చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీపీ నాగ మద్దమ్మ, ఎల్లారెడ్డి, కరిమద్దల పుల్లయ్య, గడిగరేవుల రామ్మోహన్ రెడ్డి, పెసర వాయి శ్రీకాంత్ రెడ్డి, కొరటమద్ది కృష్ణారెడ్డి, బండపల్లి రమేష్, రఘు మాధవరెడ్డి, శివానందరెడ్డి, గని ప్రతాప్ రెడ్డి, మంచాలకట్ట మేఘనాథ్ రెడ్డి, వండుట్ల రవీంద్రారెడ్డి, కాలు నాయక్, చిందుకూరు వెంకటకృష్ణారెడ్డి, సొసైటీ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, గ్రంధివేముల శివారెడ్డి, నంద్యాల వెంకటేశ్వర్లు, దేశం సంజీవరెడ్డి, మండలంలోని పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

కన్వీనర్లు, గృహ సారథులు తోడుగా ఉండాలి : ఎమ్మెల్యే గంగుల

ఆళ్లగడ్డ : రాష్ట్రంలో వైసిపిని మరోమారు అధికారంలోకి తీసుకొని రావడానికి గృహసారథులు, కన్వీనర్లు వైసిపికి తోడుగా నిలవాలని ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రరెడ్డిలు పేర్కొన్నారు. మంగళవారం దొర్నిపాడులో మండల వాలంటీర్లు, గృహసారథులు, కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రతి కార్యకర్త పని చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులకు వివరించాలన్నారు. గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి తేడా ఏంటో ప్రజలకు వివరించాలన్నారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లు సమన్వయంతో అర్హత కలిగి ఏదైనా సంక్షేమ పథకం అందని వారు ఉంటే గుర్తించి సంక్షేమ పథకం అందేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అమర్నాథ్ రెడ్డి, ఎంపిడివో నాగ అనసూయ, దొర్నిపాడు మండల సొసైటీ అధ్యక్షుడు భూమా చెంచి రెడ్డి, శివరామిరెడ్డితో పాటు మండలంలోని సర్పంచులు ఉప సర్పంచ్లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

ప్యాపిలి : పార్టీ గెలుపు కోసం ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేయాలని వైసిపి డోన్ నియోజకవర్గ పరిశీలకులు కోన మురళీధర్ రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక వైసీపీ కార్యాలయ ఆవరణలో వాలంటీర్లు, కార్యకర్తల తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించి, ఏ పథకాలు ప్రజలకు చేరాయో వాటిని లబ్ధి పొందిన వారికి తెలియజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో జడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామిరెడ్డి, వ్యవసాయ సలహామండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర రెడ్డి, సర్పంచ్ లక్ష్మీదేవి, ఉప సర్పంచ్ గడ్డం భువనేశ్వర్ రెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ బొర్రా మల్లికార్జున రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ బోరెడ్డి పుల్లారెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు వెంకటరెడ్డి, వైసిపి నాయకులు జంగం చంద్రశేఖర్,పర్వతం శ్రీను, జయ రామయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

మాట్లాడుతున్న డోన్ నియోజకవర్గ పరిశీలకులు కోణ మురళీధర్ రెడ్డి

అవాజ్ కమిటీ ఆధ్వర్యంలో స్వాములకు అన్నదానం

ప్రజాశక్తి - నందికొట్కూరు

పట్టణంలోని శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయంలో ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో శివ స్వాములకు అన్నదాన కార్యక్రమము మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ బిక్ష కార్యక్రమానికి నందికొట్కూరు పట్టణము, పరిసర ప్రాంతాలకు చెందిన దాదాపు 300 మంది శివ స్వాములు హాజరయ్యారు. ఆవాజ్ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అబుబక్కర్ మాట్లా డుతూ కుల, మతాలకు అతీతముగా సేవా భావంతో,ఔన్నత్యము కలిగి ఉండడమే దేశం గొప్ప లక్షణమని, అందుకు నిదర్శనమే నేడు నందికొట్కూరు పట్టణములో జరిగిన బిక్ష కార్యక్రమమని అన్నారు. ఎప్పుడూ ఎలాంటి పండగ జరిగినా అందరూ కలిసిమెలిసి ఒకరి పండగలకు ఒకరు హాజరై సోదర భావంతో మెలుగుతున్నందునే నందికొట్కూరు పట్టణంలో ఎప్పుడూ ఎలాంటి మత ఘర్షణలు మత గొడవలు జరగలేదని అన్నారు. రాబోయే భవిష్యత్తు తరాలు కూడా ఈ విధముగా సోదర భావంతో మెలగాలని ఆకాంక్షించారు. అనంతరము శివ స్వామి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో ఇటువంటి గొప్ప కార్యక్రమము నిర్వహించడము హర్షణీయం అన్నారు. కుల మతాలకు అతీతముగా జీవించడంలో నందికొట్కూరు పట్టణము అన్ని ప్రాంతాలకు ఆదర్శప్రాయం అని తెలిపారు. అనంతరము మండల ఖాజీ మౌలానా సయ్యద్ జలాల్ మాట్లాడారు. ఈ కార్యక్రమములో శివ స్వాము లు, అయ్యప్ప గుడి నిర్వాహకులు ఆవాజ్ కమిటీ జిల్లా ఉపాధ్యక్షుడు అబ్దుల్ రహిమాన్,సహాయ కార్యదర్శి మహబూబ్ బాషా,ఆవాజ్ కమిటి పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్లా, షేక్ అబ్దుల్లా, అల్తాఫ్, మాసూమ్, ఆదమ్, ఖురేష్,మెహబూబ్ బాష,రఫీ, మారుతి నగర్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

శివ స్వాములకు బిక్ష పెడుతున్న ఆవాజ్ కమిటీ నేతలు

ఎఫ్ఆర్ఎస్ హాజరు నుంచి మినహాయించండి

ప్రజాశక్తి - చాగలమర్రి

అరకొర వేతనాలతో ఉద్యోగాలు చేసే వీఆర్ఎలకు ముఖ హాజరు నుంచి మినహాయించాలని వీఆర్ఎల సంఘం మండల అధ్యక్షులు అబ్దుల్ గఫార్ కోరారు. చాగలమర్రి పట్టణంలోని తహసీల్దారు కార్యాలయంలో వీఆర్ఎల సంఘం నాయకులు సీనియర్ సహాయకులు శ్రీనివాసరెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.10500ల వేతనానికి పని చేస్తున్న తమకు ముఖ హాజరు పెట్టి ఇబ్బందులకు గురి చేయవద్దని వారు వాపోయారు. మండలంలో 46మంది ఉండగా 34 మంది పేర్లు మాత్రమే ఫేస్ యాప్‌లో డౌన్లోడ్ చేసుకోమని ఇచ్చారన్నారు. రాష్ట్ర వీఆర్ఏ సంఘం నాయకులు సీసీఎల్‌డిఏ కార్యాలయంలో చర్చలు జరుపుతున్నారని చర్చల అనంత రం వారి నిర్ణయం ప్రకారం తాము నడుచుకుంటామని వివరించారు. సంఘం నాయకులు నరసింహులు, వెంకట రమణ ,వేణు,ఆనంద్, పెద్ద దస్తగిరి, లక్ష్మిదేవి,కుమారి పాల్గొన్నారు.

ఘనంగా గ్రామ దేవతల జాతర

ప్రజాశక్తి - బేతంచెర్ల

మండలంలోని గోరుమాన్ కొండ తాండ గ్రామంలో గ్రామ దేవతలైన సుంకులమ్మ, మారెమ్మ, పెద్దమ్మ దేవతల దేవర మహోత్సవం గ్రామస్తులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. గురుమాన్ కొండ సర్పంచ్ కోడె వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బేతంచర్ల ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, వైసీపీ సీనియర్ నాయకులు బాబుల్ రెడ్డి, గూని నాగరాజు, తిరుమలేశ్వర్ రెడ్డి, టిడిపి నాయకులు షేక్షావలి చౌదరి, చంద్ర శేఖర్ చౌదరి, రామనాథం, శ్రీనివాస్ గౌడ్, తిరుమ లేశ్ చౌదరి, పాల్గొని అమ్మవార్లకు పూజలు చేశారు.

NANDYAL MUNICIPALITY

e-procurement Tender Notices No.47/2022-23/E1, Dt.07-02-2023, 48/2022-23/E1, Dt. 07-02-2023 49/2022-23/E1, Dt.07-02-2023 and 50/2022-23/E1, Dt.07-02-2023

మునిసిపల్ సాదారణ నిధులు మరియు గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో రూ.119.21 లక్షలతో 14 పనులు అర్హులైన కంట్రాక్టర్ల నుండి టెండర్లు స్వీకరించబడును వివరములకు e-procurement.gov.in నుండి పొందగలరు.

కమిషనరు,
నంద్యాల పురపాలక సంఘము.